PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 286 | విజయవాడ, మంగళవారం 20 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 20 May 2025 | Rs

భారత్‌కు అమెరికా షాక్

- ఎగుమతైన 15 కంటెయినర్ల మామిడిపండ్లు తిరస్కరణ
- డాక్యుమెంటేషన్‌లో లోపాలను ఎత్తిచూపుతూ నిరాకరణ
- వ్యాపారులకు భారీ నష్టం.. రూ.4 కోట్లకు పైనేనని అంచనా

7

సన్‌రైజర్స్ మురిసింది

- లక్నోపై ఆరు వికెట్లతో ఘన విజయం

8

ప్రమాదంలో 'సమాఖ్య'స్ఫూర్తి

- రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని కాపాడుకోవాలి
- 'సుందరయ్య' స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ సమాఖ్య స్ఫూర్తి ప్రమాదంలో పడిందని కేంద్ర సమాచార హక్కు మాజీ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన స్మారకోపన్యాసం విజయవాడలో సోమవారం జరిగింది. ఎంబివికెలో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రస్ట్ ఛైర్మన్ పి మధు అధ్యక్షత వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంతో ముందుచూపుతో మన పెద్దలు రాజ్యాంగాన్ని దేశానికి అందించారని చెప్పారు. సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, గణతంత్రం వంటి గొప్ప అంశాలు రాజ్యాంగంలో ఉన్నా వీటిని పాటించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలు చేసే బిల్లులను కేంద్ర ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థ ద్వారా అడ్డుకుంటోందన్నారు. ఇది కేవలం ప్రతిపక్ష రాష్ట్రాల్లోనే జరుగుతోందన్నారు. తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో బిల్లులు కొన్నేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన చేయలేని స్థితికి తయారు చేస్తున్నామా? అని ప్రశ్నించారు. ఇది సుపరిపాలనా? దుష్పరిపాలనా? అని ప్రశ్నించారు. విచక్షణలేని వారంతా గవర్నర్ స్థానంలో ఉండటం వల్ల పాలన పక్షవాతం బారిన పడుతోందన్నారు. రాష్ట్రాల సమాఖ్యగా ఉన్న దేశంలో ఇలాంటివి శ్రేయస్కరం కాదన్నారు. సుందరయ్య వంటి నేతలు ఉంటే

మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

ఇలాంటి అంశాలపై కేంద్రాన్ని నిలదీసేవారని తెలిపారు. రాష్ట్రపతి వద్దకు వెళ్లిన బిల్లులను మూడు నెలల వ్యవధిలో ఆమోదింపజేయాలని కేంద్ర హోంశాఖ సుప్రీంకోర్టును కోరిందని చెప్పారు. ఇప్పుడు 14 ప్రశ్నలు ఎందుకు? సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచ్ ఏర్పాటుచేసి సలహా ఇవ్వాల్సిన అవసరం ఎందుకని ప్రశ్నించారు.

రాజ్యాంగం ప్రకారం అందరికీ సమాన అవకాశాలు కల్పించినా, వాటికి భంగం కలిగించే ప్రయత్నాలు ముమ్మరం కావడం ప్రమాదకరమని చెప్పారు. పాకిస్తాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించింది ఎవరూ? నిలిపివేసింది ఎవరూ? అని ప్రశ్నించారు. పాకిస్తాన్-భారతదేశం మధ్య కాల్పుల విరమణ ప్రకటన అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించడం దేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసినట్లు కాదా? అని నిలదీశారు. పహల్గాంలో 26 మందిని ఉగ్రవాదులు చంపారని గుర్తు చేశారు. మణిపూర్‌లో 250 మందిని చంపిన వారు కూడా ఉగ్రవాదులు కాదా? అని నిలదీశారు. దేశంలో సామాన్యులకు న్యాయం అందడం లేదని, ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం ఆశించిన నిజమైన న్యాయం ఇది కాదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ మిగతా 7లో

ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతుగా

21న వామపక్షాల సంఘీభావం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణకు ఈ నెల 21 నుండి నిరవధిక సమ్మెకు దిగుతున్న కార్మికులకు మద్దతుగా 21న విజయవాడలో వామపక్ష పార్టీలు నిర్వహిస్తున్న సంఘీభావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పి ప్రసాద్, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి బంగార్రావు, ఎస్‌యుసిఐసి నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు పివి సుందర రామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకి రాములు ఉమ్మడిగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో ప్రయత్నాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మూడు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించిందని తెలిపారు. రెండో దఫాలో 2,600 మందిని తొలగించేందుకు సిద్ధమైందని పేర్కొన్నారు. పర్మినెంటు కార్మికులు 1,400 మందిని తగ్గిస్తోం దని, ఎనిమిది నెలల నుండి కార్మికులకు సగం జీతాలే చెల్లిస్తోందని, సొంత గనులు ఇవ్వకుండా మోసం చేస్తోందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని, కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాగేసుకునే చందంగా రూ.9,346 కోట్లను వివిధ బకాయిల పేరుతో తిరిగి లాగేసుకుందని తెలిపారు. ఇలాంటి కుట్రలకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు పోరాడుతుంటే వారిని అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను నియమించి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గానికి వత్తాసు పలుకుతోందని తెలిపారు. ఈ ద్వంద్వ వైఖరి విడనాడి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అయిన ఉక్కు రక్షణకు కేంద్ర ప్రభుత్వంపై టిడిపి కూటమి ఒత్తిడి తీసుకురావాలని వామపక్షాలు కోరుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు 21న విజయవాడలో జరిగే సంఘీభావ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

సిఎస్, సిఎంఒ సెక్రటరీలతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

12 తరువాత ఆకస్మిక తనిఖీలు

డేటా అనలటిక్స్‌కు అన్నిశాఖల్లో ప్రాధాన్యత

ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జూన్ 12 తరువాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ సేవలపై సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలపై ఐవిఆర్‌ఎస్, క్యూఆర్‌కోడ్‌ల ద్వారా అందిన ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వ్యక్తమైన అభిప్రాయాలపై సిఎస్, సిఎంఒ సెక్రటరీలతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తోందని, అన్ని శాఖల సేవల్లోనూ సంతృప్తి కనిపించాలన్నారు. ఆర్‌టిసి వంటి చోట్ల సేవల్లో ఇంకా నాణ్యత పెరగాలని అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఏడాదికి ఇచ్చే మూడు సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామంటూ చేసిన ప్రకటనపై మాట్లాడుతూ దీపం పథకం కింద సిలిండర్ పొందొచ్చని, అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుందని వివరించారు.

రేషన్ పంపిణీలో నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమగోదావరి జిల్లా మొదటిస్థానంలో ఉందని తెలిపారు. గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే ప్రశ్నకు 62 శాతం మంది లేదని సమాధానం ఇచ్చారు. ఆర్‌టిసి సేవల విషయంలో ఆశించిన స్థాయిలో సంతృప్తి లేదు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వ్యక్తంచేశారు. గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణపై ఎక్కువమంది సంతృప్తి వ్యక్తం చేశారని సిఎం చెప్పారు. ప్రభుత్వ సేవల్లో డేటా ఎనలటిక్స్ చాలా కీలకమని అన్నారు. ప్రజల నుండి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్ధవంతంగా విశ్లేషించాలని, అసంతృప్తి వ్యక్తమవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా పనిచేయాలని తెలిపారు.

మద్యం కేసులో సుప్రీం తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి సంబంధించిన మద్యం కేసులో సుప్రీంకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసులో తన అరెస్టు చట్ట వ్యతిరేకమని కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తన కుమారుడు అరెస్ట్‌లో నిబంధనలు పాటించలేదని కసిరెడ్డి ఉపేంద్ర రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ముగిసింది. జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చినప్పుడు చెప్పిన కారణాలు వేరని, కస్టడీ రిపోర్టులో వేరే కారణాలను వెల్లడించారని కసిరెడ్డి తండ్రి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. విజయవాడకు తరలించాక అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేశారన్నారు. ఆంధ్రాకు చెందిన సిఐడి వేరే రాష్ట్రంలో నోటీసులు ఇవ్వడం చెల్లదంటూ పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టు సమయంలో కానీ, కస్టడీ సమయంలో కానీ పిసి యాక్ట్‌పై కసిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, సుప్రీంకోర్టు పిటిషన్‌లో కొత్త అభ్యంతరాలను లేవనెత్తుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా చెప్పారు.

జై శంకర్ మౌనం సహించరానిది!

- 'సిందూర్'లో విమానాలకు నష్టంపై రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత విమానాలకు జరిగిన నష్టంపై ప్రభుత్వం మౌనం పాటిస్తోందని, విదేశాంగ మంత్రి జై శంకర్ ఎలాంటి సమాధానమూ చెప్పడం లేదని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఈ ఆపరేషన్ సందర్భంగా భారత వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయిందో చెప్పాలని కోరినా ఇంతవరకు మంత్రి సమాదానం ఇవ్వకపోవడం తీవ్రంగా ఖండించదగ్గదని అన్నారు. ఇదేమీ పొరపాటు కాదు.. నేరమని చెప్పారు. దేశం వాస్తవాన్ని తెలుసుకోవాల్సిన అవసరం వుందని, అందుకే మరోసారి ప్రశ్నిస్తున్నామని అన్నారు. మిలటరీ ఆపరేషన్ గురించి ముందుగానే పాకిస్తాన్‌కు తెలియడం వల్ల మనం ఎన్ని విమానాలు కోల్పోయామో ప్రభుత్వం వెల్లడించాలని రాహుల్ పట్టుబట్టారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనిపై బిజెపి స్పందిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పాకిస్తాన్ భాష మాట్లాడుతున్నారని, అసలు దేశానికి మద్ద తునిచ్చే విషయంలో కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గానే వ్యవహరిస్తోందా లేదా అని తమకు అనుమానం కలుగుతోందని పేర్కొంది. ఇదే అంశంపై ఇంతకు ముందు కూడా జై శంకర్ తీరును రాహుల్‌గాంధీ విమర్శించారు. జై శంకర్ మిగతా 7లో

'ఉక్కు' ప్రైవేటీకరణ కుట్రలు సాగనివ్వం

- నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు దారుణం
- సమ్మెకు దేశవ్యాప్త మద్దతు : తపన్‌సేన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రైవేటీకరణ కుట్రలు సాగనివ్వబోమని సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. సోమవారం ఆయన విశాఖలోని సిఐటియు కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ కుమార మంగళంలతో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు యాజమాన్యం కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులపై నేరపూరితమైన వేధింపులకు పాల్పడుతోందని తెలిపారు. నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, పర్మినెంట్ కార్మికులపై, కార్మిక సంఘాల నాయకులపై సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులతో కక్ష సాధింపు చర్యలకు దిగడం

తపన్‌సేన్ మాట్లాడుతుండగా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

దారుణమన్నారు. వీటిని ఖండిస్తూ నేటి (మంగళవారం)నుండి జరగనున్న సమ్మెకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తోందని చెప్పారు. అన్ని ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమల కార్మికులు ఈ సమ్మెకు మద్దతిస్తున్నారని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.11,400 కోట్ల ప్యాకేజీ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడానికి కాదని, ప్రైవేట్ వ్యక్తులకు ప్లాంట్‌ను అమ్మేసే కుట్ర అందులో దాగి ఉందని అన్నారు. ప్లాంట్ అప్పును రీషెడ్యూల్ చేయడానికి ప్యాకేజీ ఇచ్చినట్లు వివరించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కేంద్ర ప్రభుత్వానిది కాదని, ఇది పూర్తిగా పీపుల్స్ ప్లాంట్ అని తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఈ ప్లాంట్‌ను అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు. దేశంలోని ప్రైవేట్ ఉక్కు పరిశ్రమలకు సొంత గనులున్నాయని, ప్రభుత్వ రంగ విశాఖ ఉక్కుకు మాత్రం పాలకులు ఐరన్ ఓర్, కోల్ మైన్స్ ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులు కష్టపడి మిగతా 7లో

జాతి యావత్తూ సిగ్గుపడుతోంది

- మధ్యప్రదేశ్ మంత్రి షా క్షమాపణను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- సిట్ విచారణకు ఆదేశం

విజయ్‌షా

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ సమాచారాన్ని మీడియాకు వివరించిన సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన చెప్పిన క్షమాపణలను అంగీకరించలేమని స్పష్టం చేసింది. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టేందుకు ముగ్గురు ఐపిఎస్ అధికారులతో మంగళవారం ఉదయానికల్లా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ బృందంలో ఒక మహిళా అధికారి కూడా వుండాలని, ఈ నెల 28కల్లా నివేదికను అందజేయాలని ఆదేశించింది.

హేయమైన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పలేదేం?

అర్థం లేని వ్యాఖ్యలు చేసినందుకు మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జస్టిస్ సూర్యకాంత్, మంత్రి నిజాయితీగా కూడా క్షమాపణలు చెప్పలేదని వ్యాఖ్యానించారు. "ఆ క్షమాపణ ఏమిటి? మీరు చెప్పిన క్షమాపణ ఎలా వుంది? క్షమాపణ అంటే దానికి ఒక అర్థం వుంటుంది. కొన్నిసార్లు వ్యక్తులు ఈ విచారణల నుండి బయటపడేందుకే మర్యాదపూర్వకమైన భాషను ఉపయోగిస్తూ వుంటారు. కొన్నిసార్లు వారు మొసలి కన్నీళ్ళు కారుస్తారు. మీది ఏ తరహా క్షమాపణ? మీరు క్షమాపణ చెప్పాలని కోర్టు అడిగిందనే భావనను మీరు కలిగించాలనుకున్నారు. ఇలాంటి మిగతా 7లో

ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కొత్తపల్లి (నంద్యాల)

అస్వస్థతకు గురై ఉపాధి కార్మికుడు మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రమఠం గ్రామానికి చెందిన నల్లవలి గొల్ల శివన్న (63) గ్రామ శివారుల్లో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లారు. పని చేస్తూ.. ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలి పోయారు. వెంటనే ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అటు నుంచి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు పరీక్షించిన వైద్యులు తెలిపారు.

అస్పష్టంగా చర్చలు

డిఇఒ కార్యాలయాల ముట్టడి యథాతథం

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ ఆధ్వర్యాన సోమవారం జరిగిన చర్చలు అస్పష్టంగా ముగియడంతో రేపు (21వ తేది-బుధవారం) తలపెట్టిన డిఇఓ కార్యాలయాల ముట్టడి యథాతథంగా కొనసాగుతుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. చర్చలు ముగిసిన తరువాత సోమవారం సాయంత్రం ఈ మేరకు ఐక్యవేదిక నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న నోటీసులు ఇవ్వడంతో7 పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు ఆధ్వర్యాన ఐక్య వేదిక సంఘ నాయకులతో సోమవారం సుధీర్ఘంగా చర్చలు జరిగాయని వారు తెలిపారు. సమాంతర మీడియం, మైనర్ మీడియం, ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్, ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యా యులుగా నియమించడం, ఫౌండేషన్ పాఠశాలల్లో శాస్త్రీయమైన విధానాన్ని పాటించకపోవడం తదితర అంశాలపై చర్చల్లో సందిగ్ధత కొనసాగిందన్నారు. వీటిపై అధికారుల నుంచి స్పష్టత రానందున మే 21వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో చేపట్టిన కార్యక్రమం యాథాతథంగా కొనసాగుతుందని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర పాఠశాల విద్యా భవన్ ముట్టడి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీన కొనసాగిస్తామని ఐక్య వేదిక నాయకులు తెలిపారు. సోమవారం జరిగిన చర్చల్లో ఐక్య వేదిక నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, పి.మనోహర్ కుమార్ (యుటిఎఫ్), సాయి శ్రీనివాస్, రఘునాథరెడ్డి (ఎస్‌టియు), జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి (ఎపిటిఎఫ్-1938), గిరి ప్రసాద్, కృష్ణయ్య (పిఆర్‌టియు), సిహెచ్ మంజుల, కె.భానుమూర్తి (ఎపిటిఎఫ్-257), బాలాజీ, సత్యనారాయణ (ఎపియుఎస్), ప్రకాశరావు (ఎపిపిటిఎ), శ్రీనివాసులు, రమణ (హెచ్ఎంఎ), అశోక్ కుమార్ రెడ్డి (వైఎస్‌ఆర్‌టియు) తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టులో టెల్కోలకు ఎదురు దెబ్బ!

7

అలీఖాన్ పిటిషన్ విచారణకు అంగీకారం

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రొఫెసర్
- బేషరతుగా విడుదల చేయాలి : ఐద్వా

7

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు

26 నుంచి కౌన్సెలింగ్

- ఎపిఆర్‌ఇఐఎస్

2

పనులు, మరమ్మతులకు రూ.344 కోట్లు

- రూ.10 లక్షలలోపు పనులు సాగునీటి సంఘాలకు
- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జలవనరులశాఖలో ఒఅండ్ఎం పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇరిగేషన్ పనుల నిర్వహణ, మరమ్మతులకు ముఖ్యమంత్రి రూ.344 కోట్లు విడుదల చేశారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఒఅండ్ఎం పనులపై మంత్రి అన్ని జిల్లాల అధికారులతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు 12 రోజులే ఉన్నందున వెంటనే పనులు ప్రారంభించాలని తెలిపారు. వీటిపై సిఇ, ఎస్ఇలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. రూ.10 లక్షలు దాటిన పనులకు ఏడు రోజుల గడువులోగా పూర్తి చేసేలా షార్ట్ టెండర్లు పిలవాలని సూచించారు.

రూ.10 లక్షలలోపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యాన చేసుకోవచ్చని రామానాయుడు తెలిపారు. గత ప్రభుత్వంలో ఒఅండ్ఎం పనులను గాలికి వదిలేశారన్నారు. కాలువల్లో మట్టి తీయలేదని, గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని విమర్శించారు. గతంలో వందలు, వేల కోట్లు వ్యయం చేసి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు డ్రెయిన్లు నిర్మిస్తే 2019లో వచ్చిన ప్రభుత్వం కనీస నిర్వహణ చేయలేదని తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యేలు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, కడా కమిషనర్ రామ్‌సుందర్‌రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నందిగం సురేష్‌కు రిమాండ్

ప్రజాశక్తి మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెంలో టిడిపి కార్యకర్త ఇసుకపల్లి రాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కేసులో మాజీ ఎంపి నందిగం సురేష్‌ను సోమవారం మంగళగిరి కోర్టులో పోలీసులు హాజరు పరిచారు. ఆయనకు జూన్ రెండు వరకు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో గుంటూరు జైలుకు నందిగం సురేష్‌ను తరలించారు. ఇసుకపల్లి రాజుపై దాడి చేశారనే ఆరోపణలతో నందిగం సురేష్‌ను ఆదివారం తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో సోమవారం ప్రవేశ పెట్టగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.

గెడ్డలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గెడ్డలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పార్వతీపురం మండలం పులిగుమ్మి గ్రామంలో మడక గుంపస్వామి కుమారుడు శేఖర్ వివాహానికి పెళ్లికూతురు తరపున నూజివీడు ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన బంధువులు తరలివచ్చారు, పెళ్లికూతురి సోదరుడు, వారి బంధువులు ఐదుగురు యువకులు కలిసి గ్రామ సమీపంలోని సాకిగెడ్డలో ఈత ఆడేందుకు వెళ్లారు. గెడ్డ లోతు తెలియక, గుమ్మిలో పడి ఊపిరాడక బొత్స ఈశ్వరరావు (16), నగిరెడ్డి సాయిరాం (16) మృతి చెందారు. మిగతా ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను పోలీసులు బయటకు తీశారు.

ముందస్తు బెయిల్ కోరుతూ వంశీ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

గనుల అక్రమ తవ్వకాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.195 కోట్లకు పైగా నష్టం వచ్చిందంటూ గన్నవరం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, పిటి వారెంట్ కోసం కింది కోర్టును కోరకుండా పోలీసులను నిలువరించాలని కోరారు. ఈ మేరకు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ వై లక్ష్మణరావు సోమవారం విచారణ జరిపారు. తదుపరి వాదనల కోసం మంగళవారానికి వాయిదా వేశారు. 'అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. వేరే కేసులో నిందితుడిగా జైల్లో ఉన్న తనను బయటకు రాకుండా ఉండేందుకు మరో కేసు నమోదు చేశారు. పోలీసులు వరుస కేసులు పెడుతున్నారు. పిటి వారెంట్ విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలి' అని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదించారు. పోలీసుల తరపున పిపి ఎం లక్ష్మీనారాయణ, ప్రతి వాదన చేస్తూ.. కేసు నమోదు చేయకుండానే గత ప్రభుత్వ హయాంలో విమాన టికెట్లు బుక్ చేసి ముంబయి వెళ్లి అరెస్టులు చేశారని గుర్తు చేశారు. వంశీపై కేసు నమోదు విషయంలో చట్ట నిబంధనలను పాటించామన్నారు. ఫేక్ పట్టాలు పంచిన కేసులో పిటిషనర్ నిందితుడిగా ఉన్నారని, వైసిపి అధికారంలోకి వచ్చాక ఛార్జిషీట్లో తన పేరు లేకుండా చేసుకున్నారన్నారు. వంశీ పలు కేసుల్లో నిందితుడన్నారు. కింది కోర్టులో పిటి వారెంట్ వ్యవహారం మంగళవారానికి వాయిదా పడిందన్నారు.

యువతకు మార్గదర్శి సుందరయ్య

- 40వ వర్ధంతిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- నేటి నుండి సిపిఎం సమైక్యతా యాత్రలు

సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధన, అనైతిక రాజకీయాలు పెచ్చరిల్లుతున్న నేటి రాజకీయ వ్యవస్థను చూసి నిరాశ, నిస్పృహలకు గురవుతున్న స్థితిలో యువతకు ప్రత్యామ్నాయ ఆలోచనలు, స్ఫూర్తినివ్వడంలో కమ్యూనిస్టు దిగ్గజం పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో సుందరయ్య 40వ వర్ధంతి జరిగింది. తొలుత వి.శ్రీనివాసరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగేయాలు ఆలపించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో ప్రత్యామ్నాయ ఆలోచనలు వస్తున్న తరుణంలో సుందరయ్య లాంటి వ్యక్తులు నూతన రాజకీయ సంస్కృతికి ఆదర్శంగా ఉంటారని తెలిపారు. భూమి, వేతనాల కోసం, అన్నిటికీ మించి తెలంగాణా సాయుధ పోరాటంలో సారథ్యం వహించి నైజాంను కూల్చడంలో ఆయన కృషి కీలకమన్నారు. ప్రజావిజన్ ఎలా ఉంటుందో 1946లోనే విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పేరుతో వివరించారన్నారు. రాష్ట్రం అభివృద్ధి కావాలన్నా, ప్రజా సంక్షేమం జరగాలన్నా విశాలాంధ్రలో ప్రజారాజ్యం తరహాలో నూతన కార్యక్రమం ఉండాలన్నారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడే విజన్ కార్పొరేట్ శక్తుల, విస్తరణకు ఉపయోగపడేదేనని అన్నారు. రైతులకు, దున్నేవాడికి భూమి కావాలని సిపిఎం అడుగుతుంటే భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రజల్లో అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు మతోన్మాదాన్ని, విచ్ఛిన్నకర ఉద్యమాలను ముందుకు తెస్తున్నారని అన్నారు. కాశ్మీర్ లాంటి చోట్ల నిస్పృహ, అసంతృప్తితో యువత ఉగ్రవాదంవైపు మళ్లి పాకిస్తాన్ సాయంతో 26 మందిని పొట్టనబెట్టుకున్నారని అన్నారు. దానికి వ్యతిరేకంగా మొదలుపెట్టిన ఆపరేషన్ సింధూరలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశిస్తే కాల్పుల విరమణ ప్రకటించేశారని తెలిపారు. ప్రధాని తీరుతో దేశ ఆత్మగౌరవం దెబ్బతినే పరిస్థితి వస్తోందని తెలిపారు. మూడు రంగుల జెండా సమున్నతను అమెరికాకు తాకట్టుపెట్టి అదే జెండా పట్టుకుని తిరంగాయాత్రలకు బిజెపి పిలుపు ఇచ్చిందని, దీనిలో టిడిపి ఎందుకు పాల్గొందని ప్రశ్నించారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం పిలుపు ఇస్తే అన్ని పార్టీలను కలుపుకుపోవాలని అన్నారు. కానీ ఇతర పార్టీల ముఖ్యమంత్రులు, నాయకులను భాగస్వామ్యం చేయడం లేదని విమర్శించారు. మత సామరస్యాన్ని కాపాడిన ఎన్‌టిఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీ నాయకులు మతోన్మాద పార్టీ వెంట తిరగడం అంటే నాయకత్వ క్యారెక్టర్‌ను అనుమానించాల్సి వస్తోందని తెలిపారు. జనసేన నాయకులు పవన్‌కల్యాణ్ ఆర్ఎస్ఎస్‌కు మించి తమది హిందూ దేశమంటూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సిపిఎం మంగళవారం నుండి సమైక్యతాయాత్రలకు పిలుపు ఇచ్చిందని ప్రకటించారు. జాతి, కుల, మతభేదాలు లేకుండా అందరూ ఏకమై సుందరయ్య స్ఫూర్తితో సమైక్యతా యాత్రతో వాడవాడలా సందేశాన్ని తీసుకెళ్లాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ సుందరయ్య యువతకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితరులు పాల్గొన్నారు.

'మనమిత్ర'పై మరింత అవగాహన

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని, ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్ నుంచే పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆర్‌టిజిఎస్ కార్యకలాపాలపై ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. జూన్ 12వ తేదీలోపు మనమిత్రతో 500 రకాల సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగనవసరం లేకుండా అన్ని సేవలూ మనమిత్ర నుంచే పొందాలని సూచించారు. ఆ దిశగా మనమిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ అంశంలో సచివాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆర్‌టిజిఎస్ డేటా అనుసంధాన ప్రక్రియ కూడా లక్ష్యాల మేరకు పూర్తయ్యేలా చూడాలని కోరారు. డేటా అనుసంధానంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా ఆర్‌టిజిఎస్ సాంకేతిక సహకారాన్ని ఆయా శాఖలకు అందించడానికి వీలవుతుందని చెప్పారు. పంచాయతీరాజ్ విభాగాధికారులనుద్దేశించి మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం, చెత్త తొలగింపు పనుల్లో కొంత పురోగతి కనిపించిందని, పారిశుధ్యం మరింత మెరుగుపడాలన్నారు. ఆర్‌టిసి సేవల్లో కూడా మరింత ప్రగతి సాధించాలని సూచించారు. డ్రోన్ మార్ట్ వెబ్ పోర్టల్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పోర్టల్ రూపొందించాలని కోరారు. ఆర్‌టిజిఎస్ సిఇఒ ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్‌తో 325 సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు నాటికి 400 సేవలు అందిస్తామన్నారు. ఎపి సేవలో 14,269 ధ్రువీకరణ పత్రాలకు, మీసేవలో 1,240 ధ్రువీకరణ పత్రాలకు బ్లాక్ చైన్ టెక్నాలజీ అమలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో పాత ధ్రువీకరణ పత్రాలు కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీతో ధ్రువీకరించనున్నట్లు చెప్పారు. డేటా లేక్ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ, ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, పసి పిల్లలపై నేరాలలో 169 మందికి కఠిన శిక్షలు

- డిజిపి వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గడిచిన పది నెలల్లో పోక్సో, వరకట్న హత్యలు, మహిళ హత్యలు, రేప్, గ్యాంగ్ రేపు కేసుల్లో 169 మంది నిందితులకు న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించినట్లు డిజిపి హరీష్ గుప్తా తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాలు అరికట్టడానికి ఐజిపి రాజకుమారి నేతృత్వంలో ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత అధునాతన ఫీచర్లతో శక్తి యాప్ అందుబాటులో ఉందన్నారు. 1.52 కోట్ల మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నట్లు చెప్పారు. 11.60 లక్షల మంది అత్యవసర సహాయం కోసం కాల్ చేయగా, 34,192 కాల్స్ తక్షణమే స్పందించాల్సినవిగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 3,193 కేసులు నమోదు చేశామన్నారు. 242 ఫ్యామిలీ కౌన్సిలింగ్ రిక్వెస్టులు, సేఫ్ ట్రావెల్ కోసం 160, తప్పిపోయిన పిల్లల కోసం 18 మంది యాప్ నుంచి రిపోర్ట్ చేసినట్లు చెప్పారు. మహిళల భద్రతకై ఐజి స్థాయి అధికారి నేతృత్వంలో 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ టీమ్స్ మఫ్టీలో నితంతరం పహారా కాస్తున్నట్లు చెప్పారు. మహిళలపై తరచూ నేరాలు జరిగే 900 హాట్ స్పాట్లను గుర్తించడం జరిగిందని, వీటిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. మహిళల పట్ల పురుషుల్లో గౌరవ భావం పెంపొందించేందుకు మార్గదర్శకాలు రూపొందించడంతోపాటు స్కూళ్లు, కళాశాలల స్థాయి నుంచి జండర్ సెన్సిటివిటీపై అవగాహన కల్పించాలన్నారు.

తుళ్లూరులో భారీ వర్షం

- పలమనేరులో నిండిన చెరువులు

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరులోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు రాజధాని తుళ్లూరులో 34 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం పడింది. శనివారం రాత్రి నుండి చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా శ్రీవారి యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్ రోడ్డుల్లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని టిటిడి సూచనలు జారీ చేసింది. చిత్తూరు జిల్లా పలమనేరు మండలంలోని నక్కపల్లి పెద్దచెరువు, పెంటచెరువు, కొత్తచెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, కూనవరం మండలాల్లో పలుచోట్ల వర్షం కురిసింది, ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

రాజకీయాలకు అతీతంగా మహిళా కమిషన్

- త్వరలో నూతన వెబ్‌సైట్ ప్రారంభం : శైలజ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తూ, సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల దాడులను, అఘాయిత్యాలను నిరోధించేందుకు కృషి చేస్తానని డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. సోమవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో కమిషన్ ఛైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..రాజకీయాలకు అతీతంగా మహిళా కమిషన్ పనిచేస్తుందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఏ పార్టీ వారు అయినా తనకు ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. గతంలో తమ వద్ద నమోదైన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అవసరమైతే వాటిని జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే వారిపై శాఖపరంగా కఠినమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, మహిళలు తమపై జరుగుతున్న దాడులను నేరుగా తమ దృష్టికి తీసుకువచ్చేందుకు తమ శాఖ ద్వారా నూతన వెబ్‌సైట్ ప్రారంభించనున్నామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రాయపాటి శైలజ

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

పొగాకు కొనుగోళ్లు చేయకపోతే ఆందోళన ఉధృతం

- ధర్నాలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి
- కలెక్టర్ సమక్షంలో చర్చలు.. 21కు వాయిదా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఒప్పందం ప్రకారం పండించిన పొగాకును కంపెనీలు తక్షణమే కొనుగోలు చేసేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో గత సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారంలో కంపెనీ ప్రతినిధులను చర్చలకు పిలుస్తామని ఆ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ ఆదేనుసారం రైతులు చర్చల కోసం వచ్చారు. అయితే ఎంతసేపటికీ పిలవకపోవడంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ జోక్యం చేసుకొని.. మధ్యాహ్నం మూడు గంటలకు చర్చలు జరుపుతామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ మాట్లాడారు. అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే రైతులు, కంపెనీలతో చర్చలు జరిపి మొత్తం పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. క్వింటాలు పొగాకును రూ.18,500కు కొనుగోలు చేయాలని, నంద్యాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన తర్వాత నాణ్యత లోపంలో పొగాకును తిరస్కరించకూడదని, కంపెనీలే రైతుల వద్దకు వెళ్లి అక్కడే పరిశీలన చేయాలని కోరారు. పొగాకు కొనుగోలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించినా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి సమక్షంలో చర్చలు జరిగాయి. అయితే పొగాకు కంపెనీలకు చెందిన కింది స్థాయి ప్రతినిధులు మాత్రమే హాజరు కావడంతో పైస్థాయి ప్రతినిధులు హాజరు కావాలని కోరుతూ చర్చలను 21కు వాయిదా వేశారు. చర్చల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, రైతులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు 26 నుంచి కౌన్సెలింగ్

- ఎపిఆర్ఇఐఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 26 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఎపిఆర్ఇఐఎస్ సంయుక్త కార్యదర్శి హెచ్ఎమ్‌డి ఉబేదుల్లా తెలిపారు. మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అర్హత సాధించిన విద్యార్థుల ఫోన్ నెంబర్లకు సమాచారం అందిస్తామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్ తేదీలు, ప్రదేశాలు తదితర వివరాలు కాల్ లెటర్లు, https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 21 నుంచి తెలుసుకోవచ్చన్నారు. కాల్ లెటర్లు పొందిన అభ్యర్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ఎపిఆర్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆంధ్ర ప్రాంతంలోని విద్యార్థులకు (బాల, బాలికలు) ఎంపిసి / ఇఇటి కోర్సులకు ఈ నెల 26న, బైపిసి / సిజిటి కోర్సులకు ఈ నెల 27న, ఎంఇసి / సిఇసి కోర్సులకు ఈ నెల 28న గుంటూరులోని పాత బస్టాండ్ దగ్గర, పరీక్షా భవన్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. పిపిఆర్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు రాలయసీమ ప్రాంతంలోని (బాలురుకు మాత్రమే) ఎంపిసి / ఇఇటి కోర్సులకు ఈ నెల 26న, బైపిసి / సిజిటి కోర్సులకు ఈ నెల 27న, ఎంఇసి / సిఇసి కోర్సులకు ఈ నెల 28న అన్నమయ్య జిల్లా కె.విపల్లి మండలంలోని గ్యారంపల్లిలో ఉన్న ఎపిఆర్ జూనియర్ కళాశాల (బాలురు)లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పిపిఆర్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు రాలయసీమ ప్రాంతంలోని (బాలికలకు మాత్రమే) ఎంపిసి / ఇఇటి కోర్సులకు ఈ నెల 26న, బైపిసి / సిజిటి కోర్సులకు ఈ నెల 27న, ఎంఇసి / సిఇసి కోర్సులకు ఈ నెల 28న కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు మండలంలోని బనవాసిలో ఉన్న ఎపిఆర్ జూనియర్ కళాశాల (బాలికలు)లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. నాగార్జున సాగర్‌లోని ఎపిఆర్ డిగ్రీ కళాశాల (బాలురు) ప్రవేశాలకు బిఎ, బికాం, బిఎస్‌సి కోర్సులకు ఈ నెల 29న గుంటూరులోని పాత బస్టాండ్ దగ్గర, పరీక్షా భవన్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

కర్నూలులో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గఫూర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు తపన్‌సేన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, కర్నూలు కార్పొరేషన్

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు తపన్‌సేన్ కోరారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం విశాఖ జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. సుందరయ్య చిత్రపటానికి తపన్ సేన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. భారతదేశంలో భూ పంపిణీ జరగాలని, దున్నే వారికే భూమి నినాదంతో పెద్ద ఎత్తున తెలంగాణా సాయుధ పోరాటం జరిపిన వ్యక్తి సుందరయ్య అని గుర్తుచేశారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా నిరంతరం పేదల పక్షాన ఆయన పోరాడారన్నారు. ఆయన రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం, ఆంధ్రప్రదేశ్ సమగ్ర నీటి పంపిణీ రచనలు నేటికీ ప్రామాణికంగా నిలుస్తున్నాయన్నారు. పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నేతగా ఉంటూ అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. నేటి రాజకీయాలలో సుందరయ్య లాంటి వారు చాలా అరుదుగా ఉంటారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అందరికీ విద్య, వైద్యం, తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, చేయడానికి పని కల్పించే విధంగా ప్రభుత్వంపై పోరాడాలన్నారు.

సమసమాజ స్థాపనకు పాటుపడిన సుందరయ్య

సమ సమాజ స్థాపనకు పాటుపడిన చిరస్మరణీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. కర్నూలు సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 15ఏళ్ల వయసుకే ఉప్పు సత్యాగ్రహం పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన గొప్ప త్యాగశీలి సుందరయ్య అని కొనియాడారు. ప్రతి నాయకుడికి వ్యక్తిగత జీవితంలో ప్రసంగాల కన్నా ఆచరణ ముఖ్యం అని సూచించారు. బిజెపి మత విద్వేషాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సుందరయ్య జీవితం ఆదర్శనీయం అన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం భారతదేశ సమైక్యతను దెబ్బతీస్తూ మతం వైపు తీసుకు వెళ్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడారు.

విజయనగరంలో ఎన్ఐఎ విచారణ

- విశాఖ సెంట్రల్ జైలుకు సిరాజ్, సమీర్ తరలింపు
- పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

విజయనగరంలో ఉగ్రమూలాల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారణలో సంచలన విషయాలు బయటపడినట్టు తెలిసింది. ఎన్ఐఎ అధికారులు సోమవారం విజయనగరం టూటౌన్ స్టేషన్‌కు వచ్చారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలపై పోలీసులతో మాట్లాడారు. సిరాజ్ నివాసం ఉంటున్న విజయనగరం పట్టణంలోని అబాద్ వీధికి వెళ్లి ఇంట్లో సోదాలు చేసి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. సిరాజ్, సమీర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతోపాటు విజయనగరంలో పేలుళ్లకు కుట్ర పన్నినట్టు, ఈ నెల 22న బ్లాస్టింగ్‌కు ప్లాను చేసినట్టు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసు నిందితుల రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక అంశాలు ప్రస్తావించారు. ఆరుగురు వ్యక్తులు ఇన్‌స్టా గ్రూప్ క్రియేట్ చేసుకోగా..ఇందులో సిరాజ్, సమీర్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్ర యువకులు ఉన్నట్లు గుర్తించారు. బాంబులు తయారు చేయాలని సిరాజ్, సమీర్‌కు సౌదీ నుంచి ఆదేశాలు రాగా, మిగతా నలుగురికీ బాంబులు పెట్టే టార్గెట్లు గుర్తించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అరెస్టు సమయంలో సిరాజ్ వద్ద భారీగా పేలుడు పదార్థాలు లభించాయి. సిరాజ్, సమీర్‌లకు విజయనగరం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో పోలీసులు వారిని విశాఖ సెంట్రల్ జైలుకు సోమవారం తరలించారు. అక్కడ వీరిని వేర్వేరు సెల్‌లలో ఉంచారు. వారి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు కస్టడీ పిటిషన్ వేశారు.

నిబంధనల ప్రకారం ఎన్నికలు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని, చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనరు నీలం సాహ్నిని వైసిపి నాయకులు కోరారు. కమిషన్ కార్యాలయంలో వైసిపి ఎమ్మెల్సీ ఎం అరుణ్‌కుమార్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, నాయకులు మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. తిరువూరు ఎన్నికల్లో వైసిపి కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని తెలిపారు. డిఎస్‌పి, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు దాడి చేస్తున్న వీడియోలనూ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. తిరువూరు ఎన్నికల సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా ఉందన్నారు. కౌన్సిలర్లే ఓట్లు వేయలేని పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. డిఎస్‌పి, ఎస్ఐ తదితరులు టిడిపి కార్యకర్తల్లా వ్యవహరించారని అన్నారు. ముగ్గురు కౌన్సిలర్లు ఉన్న టిడిపి ఛైర్మన్ పదవి కోసం పాకులాడటం దిగజారుడు తనమని అన్నారు. పోలీసులే కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని, మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. మంగళవారం జరిగే ఎన్నికల్లో వైసిపి సభ్యులకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు.

అవినీతికి పాల్పడితే చట్టం క్షమించదు

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతికి పాల్పడిన ఏ స్థాయి వ్యక్తినైనా చట్టం క్షమించదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనంజయరెడ్డికి సంబంధించిన మహిళ దుబాయి నుంచి తరలించిన బంగారంపైన దర్యాప్తు చేయాలన్నారు. జగన్ పాలనతో రాష్ట్రంలో భారీ లిక్కర్ స్కాం జరిగిందని, నాసిరకం మద్యం అమ్మకాలతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. లక్షలాది మంది అనారోగ్యానికి గురైనట్లు చెప్పారు. లిక్కర్‌లో రూ.3,200 కోట్లు అవినీతి కేసుపై కూటమి ప్రభుత్వం సిట్ వేసి దర్యాప్తు చేస్తుంటే వైసిపిలోని పెద్ద పెద్ద తలలు కంగారుపడుతున్నాయన్నారు. ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లైనా తప్పు చేస్తే తప్పక ఫలితాన్ని అనుభవించాలన్నారు.

దళితులపై దాడులను నియంత్రించాలి

- ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ

ప్రజాశక్తి -కొవ్వూరు(తూర్పు గోదావరి)

ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవిని తొలిసారి మాదిగలకు కేటాయించడం హర్షనీయమని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ... నేటికీ దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని, వాటిని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని జవహర్‌ను కోరారు. జవహర్ మాట్లాడుతూ.. ఎస్‌సి వర్గీకరణ పోరాటంలో మందకృష్ణ చేసిన కృషి మరువలేనిదన్నారు. తాను పదవులను ఏనాడూ కోరుకోలేదని, జాతీయ అభ్యున్నతి కోసం పాటుపడ్డాన్నాన్నారు.

శ్రీవారికి అఖండాలు సమర్పిస్తున్న మైసూరు రాజమాత ప్రమోదాదేవి

శ్రీవారికి అఖండాలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారికి శతాబ్దాల అనంతరం అఖండాలను మైసూరు రాజమాత ప్రమోదా దేవి విరాళంగా అందజేశారు. రంగనాయకుల మండపంలో రెండు భారీ వెండి అఖండ దీపాలను సోమవారం అందించారు. ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉంది. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుంది. టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోరాటాలతో విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

- స్టీల్ యాజమాన్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుమ్మక్కయ్యాయి
- నిర్బంధ చర్యలకు ప్రతిఘటనతో బదులిస్తాం
- 'ప్రజాశక్తి'తో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'నాలుగున్నరేళ్లుగా విశాఖ ఉక్కు కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకమూ కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికులపై అనేక నిర్బంధ చర్యలకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పాల్పడుతున్నా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ స్టీల్ యాజమాన్యంతో కుమ్మక్కయ్యాయి. దీన్ని కార్మికులు ఐక్యంగా ప్రతిఘటిస్తున్నారు' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. ఈ నెల 20 నుంచి విశాఖ ఉక్కు పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభమవుతున్న సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె ఎందుకు?

ఇటీవల కాలంలో ప్లాంట్‌లో నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించింది. పర్మినెంట్ ఉద్యోగుల హక్కులు, జీతాల కోత, ఇంటి అద్దెలు ఇవ్వకపోవడం, 16 రెట్లు విద్యుత్ ఛార్జీలను పెంచడం సహా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. అయినా, గత నాలుగున్నర సంవత్సరాల నుంచీ ఉత్పత్తికి భంగం కలిగించకుండా ఉద్యోగులు, కార్మికులు పోరాడుతున్నారు. ఈ నెల 13న నలుగురు నాయకులను సస్పెన్షన్ చేసి, ఏడుగురు ముఖ్య నాయకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. నోటీసులు అందుకున్న వారిలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ఎఐటియుసి సహాయ కార్యదర్శి జె.రామకృష్ణ తదితరులు ఉన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పడిన తర్వాత గత 40 ఏళ్లలో ఇలాంటి కక్షసాధింపు చర్యలు ఎప్పుడూ లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో మే 20 నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. పర్మినెంట్ కార్మికుల మద్దతు దీనికి ఉంది.

స్టీల్ సమ్మెకు సంఘీభావంగా ఆలిండియా నాయకుల సభకు ఎందుకు ప్రభుత్వం అనుమతించడం లేదు?

సమ్మెకు ముందురోజు సభకు అనుమతిని జిల్లా అధికార యంత్రాంగం ఇవ్వలేదు. ప్రభుత్వం అనుమతి ఇవ్వపోయినా సమావేశం (గేటు మీటింగ్)ను 19న నిర్వహిస్తాం. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని చెబుతూనే మరోవైపు యాజమాన్యం చర్యలను బలపరిచేలా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం సమ్మెను రాష్ట్రమంతటా అడ్డుకున్నా స్టీల్‌ప్లాంట్‌లో అడ్డుకోలేకపోయింది. కేంద్రంలోని బిజెపితో కుమ్మక్కై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు ఉద్యమాన్ని అణచివెయ్యాలని చూడడం సరికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిగజారుడుతనానికి నిదర్శనమిది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నాయి?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయి. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో రెండే నడుస్తున్నాయి. నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఉత్పత్తి తగ్గిపోతుంది. 1,213 మంది ఉద్యోగులకు విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించేశారు. మరోవైపు నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేప్టివ్ పోర్టును అనుమతించింది. ఆ ప్రైవేట్ సంస్థకు సొంత గనుల కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోంది. కానీ, 40 ఏళ్ల నుంచి ఉత్పత్తి చేస్తోన్న విశాఖ ఉక్కుకు మాత్రం సొంత గనులు ఇవ్వడం లేదు. ఇలా ఉక్కును బలహీనపరిచి ఆర్సెలార్ మిట్టల్‌కి విశాఖ ఉక్కును అప్పగించే కుట్రలు, తప్పుడు పద్ధతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి.

దీనికి పరిష్కారం ఏమిటి?

పోరాటం ఒక్కటే మార్గం. నాలుగున్నర సంవత్సరాలుగా పోరాటంతోనే స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకోగలిగాం. ఒక్క శాతం వాటాను కూడా అమ్మకుండా పబ్లిక్ సెక్టార్‌లో ఉంచుకోగలిగాం. ఇప్పుడు కూడా పోరాటాన్ని ఉధృతం చేసి ప్లాంట్‌ను కాపాడుకుంటాం. మే 20 నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె జరుగుతుంది. వీరికి మద్దతుగా పర్మినెంట్ కార్మికులు ఒకరోజు సమ్మె చేసేందుకు సిద్ధమయ్యారు.

స్టార్టప్ కంపెనీకి శంకుస్థాపన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-కడప అర్బన్

నేటి యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుంచి అందించే స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని బిసి సంక్షేమ శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. కడప నగరంలోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలో సోమవారం "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలంటే ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్ట్ అప్ ఎదగాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఇలాంటి స్టార్ట్ ఆప్ కడప కార్యక్రమాన్ని మన జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటు కావడం మన అదష్టమన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్ట్ అప్ హబ్‌ను ముందుకు తీసుకువెళ్తామని అన్నారు. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో, పిఇబి టెక్నాలజీ ఆధారంగా ఈ స్టార్ట్ అప్ కేంద్ర భవన నిర్మాణం చేపడతారని పేర్కొన్నారు. స్టార్టప్ కడప కేంద్రం యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తూ, నూతన ఆవిష్కరణను ప్రోత్సహించడమే కాక, ఆలోచనలను అభివద్ధి చెందిన వ్యాపారాల వరకు అన్ని దశల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించే లక్ష్యంతో ముందుకెళ్తుందన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వృత్తిపరమైన వర్క్‌స్పేస్‌లు, సహకార వాతావరణం వంటి అంశాలతో యువతకు అవసరమైన అన్ని వనరులు కేంద్రం అందించనుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్ మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, జెసి అదితిసింగ్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సర్వేలతో జీతాలకు లింకు?

- ఆందోళనలో సచివాలయ కార్యదర్శులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇళ్లు, వాటిలో నివాసం ఉంటున్న వారి వివరాలు పూర్తిగా సేకరిస్తేనే మే నెల జీతాలు చెల్లిస్తామంటూ గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు హెచ్చరికలు అందుతున్నాయి. కొద్దిరోజులుగా ఉన్నతాధికారుల నుండి అందుతున్న ఈ ఆదేశాలు ఆ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ కోసం పరుగులు తీస్తున్నారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అనేక సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహించి మ్యాపింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ సర్వే నెమ్మదిగా సాగుతున్న నేపథ్యంలో తాజాగా జీతాలకు, మ్యాపింగ్‌కు లింకు పెడుతూ అధికారులు ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. సాధారణంగా కార్యదర్శుల జీతాల బిల్లులు ప్రతి నెలా 15వ తేదీలోగా తయారుచేయాల్సి ఉంటుంది. అందుకే జూన్ తొలి రోజులకే మొత్తం మ్యాపింగ్ పూర్తి చేయాలని కార్యదర్శులు హడావుడి పడుతున్నట్లు కనిపిస్తోంది. తాజా గణాంకాలు పరిశీలిస్తే రాష్ట్రంలో 1,70,64,098 గృహాలు ఉండగా, ఇప్పటికే 1,70,24,735 గృహాలను మ్యాపింగ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఇంకా కేవలం 39, 363 గృహాల మ్యాపింగ్ మాత్రమే జరగాల్సి ఉంది. గత నెల్లో కన్నా ఈ నెలలో రెట్టింపు వేగంతో మ్యాపింగ్ జరుగుతోంది. అయితే ఈ ఆదేశాలతో తమకు సంబంధం లేదని ఆర్థికశాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

జన్యుపరమైన వ్యాధులపై అవగాహన

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫిలియా వంటి వ్యాధులు జన్యుపరంగా వచ్చేవని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్, హీమోఫోలియో సొసైటీ సంయుక్తంగా విజయవాడలోని ఒక హోటల్‌లో నిర్వహిస్తున్న రక్త సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో ఆధునిక పద్ధతులపై రెండు రోజుల శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 1,900 మంది హిమోఫిలియా, 2,100 మంది తలసేమియా, మరో 2,100 మంది సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారని తెలిపారు. ఇది జన్యుపరంగా వారసత్వంగా వస్తున్న వ్యాధి అని, దీనికి మందులు వాడుతూనే ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యమని చెప్పారు. బాధితుల్ని గుర్తించి వారికి క్రమం తప్పకుండా ఉచితంగా రక్తమార్పిడిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో 5 ఐసిహెచ్ఎస్ సెంటర్లతో ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స, మందులు అంది స్తోందన్నారు. అలాగే ప్రతినెలా రూ.10 వేల పెన్షన్ అందిస్తుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 10.50 లక్షల మందికి పూర్తి చేశామన్నారు. తొలుత ఈ వ్యాధులపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపి శాక్స్ ఎపిడి కామేశ్వర ప్రసాద్, జాయిండ్ డైరెక్టర్ ప్రసన్న, స్టేట్ ఇమ్యూనల్ అధికారి దేవి, హిమోఫిలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి ఎన్‌బిఎస్‌వి ప్రసాద్, సికిల్ సెల్ ఎనీమియా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎపి శాక్స్ ఎపిడి కామేశ్వర ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ ప్రసన్న తదితరులు

కదిరి, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవులు టిడిపి కైవసం

- విశాఖ, తిరువూరులో ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీ సత్యసాయి జిల్లాలో కదిరి మున్సిపల్ చైర్మన్, గాండ్లపెంట ఎంపిపి పదవులను టిడిపి కైవసం చేసుకుంది. కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దిల్షాద్ ఉన్నీసా ఎన్నిక అయ్యారు. గాండ్లపెంట ఎంపిపిగా గజ్జల సోమశేఖర్‌రెడ్డి ఎన్నిక అయ్యారు. రామగిరి ఎంపిపి ఎన్నికకు కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌గా టిడిపికి చెందిన ఎనిమిదో వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సమావేశానికి తొమ్మిది మంది వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో 21 వార్డులను వైసిపి కైవశం చేసుకోగా ఒకరు రాజీనామా చేశారు. 20 మంది కౌన్సిలర్లలో 10 మంది టిడిపికి మద్దతు ఇచ్చారు. మిగతా 10 మందిలో వైస్ చైర్‌పర్సన్ చెలికాని మురళి సమావేశానికి హాజరు కాగా తొమ్మిది మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి వైస్ ఎంపిపి-1గా వైసిపికి చెందిన మామిడిపల్లి ఎంపిటిసి సభ్యులు పంచాడ సింహాచలం నాయుడు ఎన్నికయ్యారు. మండలంలో 17 మంది ఎంపిటిసిలు ఉండగా వారిలో వైసిపికి చెందిన ఎంపిటిసిలు 12 మంది హాజరు కావడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) డిప్యూటీ మేయర్ ఎన్నికకు కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికల్లో పాల్గొనకుండా వైసిపి కౌన్సిలర్లను టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డగించారు. కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా పడింది.పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి ఎంపిపిగా టిడిపికి చెందిన మక్కా సూర్యారావు, వైస్ ఎంపిపిగా కొనకళ్ల విజయనిర్మల ఎన్నికయ్యారు.యలమంచిలి: యలమంచిలి ఎంపిపిగా ఇనుకొండ ధనలక్ష్మిని ఎన్నికయ్యారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

ఎ.ఉమామహేశ్వరరావు
ఎమ్మెస్సీ, బిఇడి, జీవశాస్త్రం సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

వ్యాధి విజ్ఞాన శాస్త్రం : ఉష్ణమండల వ్యాధులు

ఉష్ణమండల వ్యాధులు

- శరీర విధులు అన్ని సక్రమంగా జరుగుతున్నప్పుడు ఆ వ్యక్తి 'ఆరోగ్యం'గా ఉన్నట్లు.
- సంతులిత ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పరిసరాలు' శరీర ఆరోగ్యానికి అవసరం.
- సక్రమంగా పనిచేసే శరీర విధులను 'తాత్కాలికంగా గానీ, శాశ్వతంగా గానీ' కల్లోల పరచే పరిస్థితిని 'వ్యాధి' అంటారు.
- వ్యాధిజనక జీవులు శరీరంలో ప్రవేశించినది మొదలు, ఆ వ్యక్తి అస్వస్థ అయ్యే వ్యవధిలో అనేక దశలు ఉంటాయి. ఈ దశలు అన్నింటిని కలిసి 'వ్యాధి పద్ధతి' అంటారు.
- వ్యాధి పద్ధతిలో '4' దశలుంటాయి. అవి 1.వ్యాధి సంక్రమణ దశ 2.పొదిగే కాలం 3.వ్యక్తమయ్యే దశ 4.అంత్యదశ.

వ్యాధులు - వివరాలు

1.కామెర్ల వ్యాధి :

- ఇది రక్తంలోను, కణజాలాల్లో పసుపు రంగు గల 'బైలిరూబిన్' అనే వర్ణ ద్రవ్యం చేరటంతో కల్గే వ్యాధి.
- కాలేయంలో వయస్సు అయిపోయిన లేక పాడైన 'ఎర్రరక్తకణాలు' నాశనమైనప్పుడు వాటి నుండి 'బైలిరూబిన్' ఏర్పడును.
- కాలేయ కణాలు (హెపాటోసైట్స్) బైలురూబిన్‌ను పైత్యరసంలోకి స్రవింపచేస్తుంది.
- మూత్రంలో ఉండే పచ్చటి రంగు బైలిరూబిన్, దాని జీవక్రియా పదార్థాలతో కల్గుతుంది.

పచ్చకామెర్ల వ్యాధి కలగడానికి కారణం :

1.బైలిరూబిన్ ఎక్కువగా ఉత్పత్తి అవుట వలన, కొన్ని వ్యాధుల్లో కాలేయంలో అధిక సంఖ్యలో ఎర్రరక్త కణాలు నాశనంతోనే ఇలా జరుగుతుంది.

2.పిత్తం స్రమించటంలో ఆటంకం వచ్చినపుడు జరగొచ్చు. పిత్తాశయంలో రాళ్ల ఏర్పడినపుడు కూడ కామెర్లు రావచ్చు.

3. కాలేయ కణాలు సరిగా పనిచేయనప్పుడుగానీ, అవి నాశనమైనప్పుడు గాని ఇలా జరుగుతుంది. ఈ స్థితి ఒక వ్యక్తి హెపటైటిస్ వైరస్‌లతో బాధపడుతున్నప్పుడు వస్తుంది.

- **హెపటైటిస్ వైరస్‌లు చాలా రకాలు ఉన్నాయి. అవి :** హైపటైటిస్-ఎ, హెపటైటిస్-బి, హైపటైటిస్-డి, హైపటైటిస్-ఇ, హెపటైటిస్-ఎఫ్, హైపటైటిస్-జి. ప్రపంచంలో ప్రతి సంవత్సరం సుమారు 200 మిలియన్ల ప్రజలు హెపటైటిస్ వ్యాధికి గురౌతున్నారు.
- శిశుజనన సమయంలో తల్లి నుండి శిశువునకు, ఆహారం, నీరు, పాలు ద్వారా శరీరంలోకి రక్తం ఎక్కించేటప్పుడు లేక ఒకే సిరంజి, ఒకే సూది చాలా మందికి ఉపయోగించటం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందును.
- మనదేశంలో సుమారు 30 శాతం కంటే ఎక్కువ జనాభాలో ఈ హెపటైటిస్ వైరస్ కాలేయంలో కణాలను (హెపాటోసైట్స్) పాడు చేస్తాయి.

పచ్చకామెర్ల వ్యాధి లక్షణాలు :

1.కంటి తెల్లగుడ్డు పసుపు పచ్చగా మారుతుంది.
2.చర్మం రంగు కూడా పచ్చగా మారొచ్చు.
3.మూత్రం పచ్చగా ఉంటుంది.
4. రోగికి ఆకలి లేకపోవుట, కడుపు ఉబ్బరింపు (గాలిచేరుట వల్ల), మలబద్ధకం.
5.కాలేయ ప్రాంతంలో పచ్చిగా ఉంటుంది.
6. రక్తంలో బైలిరూబిన్ స్థాయి హెచ్చుగా ఉంటుంది.

పొదిగే కాలం 20-30 సంవత్సరాల మధ్య ఉంటుంది

వ్యాధి	పొదుగుకాలం
1. తట్టు/పొంగు/మీజిల్స్	10-12 రోజులు
2.గవద బిల్లలు/మంప్స్	2-3 వారాలు లేదా 18 రోజులు
3.ఆటలమ్మ	14-16 రోజులు
4.మెదడువాపు	5-15 సం॥లు
5.ఎయిడ్స్	8-10 సం॥లు
6.డిఫ్తీరియా	2-5 రోజులు
7.కోరింత దగ్గు	10-16 రోజులు
8.ధనుర్వాతం (టెటానస్)	4-3 వారాలు
9.అమీబియాసిస్	ఒక వారం
10.అతినిద్రా వ్యాధి	10-30సం॥లు(ఎక్కువ)
11.ఫైలేరియా/బోధకాలు	5-18 నెలలు

2. గవద బిళ్లలు :

- సాధారణంగా ఈ వ్యాధి 8-15 ఏళ్ల పిల్లల్లో రావచ్చు.
- 'మిక్సోవైరస్ పరోటైడిస్' అనే వైరస్‌తో గవద బిళ్లల వ్యాధి కల్గుతుంది. ఈ వైరస్ జన్యు పదార్థంలో ఒకే పోగు ఉండే ఆర్ఎన్ఎ ఉంటుంది.
- ప్రత్యక్ష తాకిడి వలనగాని, రోగి నుంచి తుంపరలు వంటి సూక్ష్మబిందువుల ద్వారా గాని ఈ వ్యాధి వ్యాపిస్తుంది.
- ఈ వ్యాధి పొదిగే కాలం 2-3 వారాలు, సాధారణంగా ఇది 18 రోజులు ఉంటుంది.
- ఈ వ్యాధితో బాధపడే వారిలో"లాలాజల గ్రంథులు' నొప్పి పెడతాయి. నోరు తెరినప్పుడు నొప్పి, చెవినొప్పి, జ్వరం ఈ వ్యాధిలో ఉంటాయి.
- ఈ వైరస్ క్లోమం, మూత్రపిండాలకు కూడా వ్యాపిస్తుంది.
- ఈ వ్యాధికి నిర్దిష్టమైన చికిత్స లేదు. కానీ టీకా తీసుకుంటే వ్యాధి రాకుండా చేసుకోవచ్చు.

3. తట్టు / అమ్మవారు లేక దద్దుర్లు:

- ఈ వ్యాధిని 'రూబెల్లా' అని కూడా అంటారు. రూబెల్లా అంటే 'ఎర్రటి మచ్చలు'.
- 'అబుబాకర్' అనే అరేబియా వైద్యుడు ఈ వ్యాధిని మొదటిసారిగా వర్ణించాడు.
- 'పారామిక్సోవైరస్' ఈ వ్యాధిని కలిగిస్తుంది.
- ఈ వ్యాధితో మనదేశంలో పిల్లలు అధిక సంఖ్యలో రోగగ్రస్తులవ్వటమో, మరణించటమో జరుగుతోంది.
- జ్వరం, దగ్గు, దాని తర్వాత శరీరంపై దద్దుర్లు ఈ వ్యాధి లక్షణాలు.
- ఈ వ్యాధి వ్యాప్తికి ప్రత్యే వాహకం లేదు. తట్టుతో బాధపడేవారి ముక్కు నుండి స్రవించే నీరు, లాలాజలంలో తుంపర ద్వారా సంక్రమణ చెందుతుంది.
- 6 నెలలు నుండి, 3 సం॥లోపు పిల్లలు ఈ వ్యాధికి గురౌతారు.
- వ్యాధి పొదిగే కాలం, జర్వం రావడానికి ముందు '10' రోజులు, వంటి మీద దద్దుర్లు వచ్చే ముందు 12-14 రోజుల వరకు ఉంటుంది.
- వ్యాధిలో ఉండే ప్రథమ లక్షణాలు అస్వస్థత భావన, జ్వరం, తుమ్ములు, ముక్కు నుండి నీరు కారడం, దగ్గు, కళ్ళు ఎర్రబడటం
- రోగిని వేరుగా ఉంచడంతో ఈ వ్యాధి తగ్గించొచ్చు.

4.మెదడు వాపు :

- ఇది దోమలతో వ్యాప్తి చెందే వ్యాధి.
- ఈ వ్యాధికి 'అర్బోవైరస్' (ఆర్థ్రోపొడ జంతువులచే వ్యాప్తి చెందేవి) వర్గానికి చెందిన వైరస్‌లు.
- మనుష్యులనే కాకుండా ఈ వైరస్‌లు అనేక జంతువులు, పక్షులను కూడా ఈ వ్యాధికి గురిచేస్తాయి.
- పందులు, పశువులు, కోళ్లు ఈ వైరస్‌కు ప్రధాన సకశేరుక అతిథేయులు
- ఈ రోగ వైరస్ 'క్యూలెక్స్' దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- ఈ వ్యాధి పొదిగే కాలం 5-15 రోజులు.
- కొద్ది జ్వరంతో, తలనొప్పితో మొదలై, తర్వాత జ్వర తీవ్రత ఎక్కువై ఫిట్స్ వస్తాయి.
- ఈ వ్యాధి 'కేంద్రనాడీ మండలం'పై ప్రభావం చూపుతుంది.

5.బోదరోగం :

- సుమారు 90 మిలియన్ల మంది ఈ వ్యాధికి గురైనవారు ఉన్నారు. -మలేరియా తర్వాత బోదరోగం మనదేశంలో ఒక పెద్ద ఆరోగ్య సమస్యగా ఉంది.
- 'వుకరేరియా బాన్ క్రాఫ్టి', 'వుచేరియా మలయ్' అనే రెండు నెమటోడ్ క్రిములు ఈ వ్యాధిని కలిగిస్తాయి.
- బాగా ఎదిగిన క్రిమి మానవుని శోషరస గ్రంథులు, శోషరస నాళాల్లో జీవిస్తుంది.
- ఈ వ్యాధి కలుగజేసే సుగ క్రిమి పొడవు 4 సెం.మీ., ఆడక్రిమి
- 5-10 సెం.మీ.పొడవు వుంటుంది.
- ఆడక్రిమి 'శీతోత్పాదకము' (ఎఙఙఙఝఖీశీబం) గుడ్లు ఆడ క్రిమి శరీరంలో పెరిగి డింభకాలకు జన్మనిస్తాయి. ఇది రోజూ సుమారు 50 వేల వరకూ చిన్న డింభకాలకు జన్మనిస్తుంది. ఈ డింభకాలను 'మైక్రోఫైలేరియా' అంటారు.
- పగటి సమయంలో ఈ డింభకాలు శరీరంలోపల ఉండే రక్తనాళాల్లో ఉంటే, రాత్రి సమయంలో శరీరం పై భాగంలో ఉండే రక్తనాళాలలోకి వస్తాయి. దీనినే 'నిశాకాల ఆవర్తనం' అంటారు.
- సంక్రమణ చెందిన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు లార్వాలు దోమలోకి ప్రవేశిస్తాయి. దోమల్లో లార్వాలు (డింభకాలు) మూడు దశల్లో అభివృద్ధి చెందుతాయి.
- సంక్రమణ చెందిన దోను కొత్త అతిథేయిని కుట్టినపుడు, లార్వాలు దోమ తుండం నుండి అతిథేయికి చేరతాయి.
- ఈ వ్యాధి పొదిగే కాలం 5-18 నెలలు.
- ఈ వ్యాధి మొదటి లక్షణాలు శోషరస గ్రంథుల వాపు, బోదజ్వరం. ఆ తర్వాత క్రిములు శోష నాళాలను అడ్డుకోవటంతో అక్కడి కణజాలాలు పెద్దవి అయి, ఆ భాగం ఉబ్బుతుంది. దీనినే 'బోద (కాలు, చెయ్యి) వ్యాధి' అంటారు.
- ఈ వ్యాధి చిక్సిత్సకు 'డై ఇథైల్ కార్బమజైన్' మందుగా వాడుతారు.

6. మలేరియా లేక చలి జ్వరం:

- క్రీ.పూ. 5వ శతాబ్దం నుంచి తెలిసిన రోగమే.
- మలేరియా అంటే 'చెడ్డగాలి' అని, ఈ వ్యాధి చెడ్డగాలితో వస్తుందని నమ్మకం.
- 1880 సం॥లో 'చార్లెస్ లావెరన్' మలేరియా 'పరాన్న జీవిని' కనిపెట్టారు.
- 1894 సం॥లో 'పాట్రిక్ మాన్సన్' మలేరియాను 'దోమలు వ్యాప్తి' చేస్తాయని భావించారు.
- 1897 సం॥లో 'సర్ రోనాల్డ్ రాస్' దోమలు మలేరియాను వ్యాప్తి చేస్తాయని నిరూపించారు. ఈ పరిశోధన 'సికింద్రాబాద్'లో జరిగింది.
- ప్రొటోజోవన్ పరాన్న జీవి అయిన "ప్లాస్మోడియం" వలన మలేరియా వస్తుంది. దీనిలో నాలుగు రకాల ప్లాస్మోడియం జాతులున్నాయి. అవి : పి.వైవాక్స్ (పి అంటే ప్లాస్మోడియం), పి.ఫాల్సిపారమ్, పి.మలేరియా పి.ఒవేల్.
- ఆడదోమలు (అనాఫిలిస్ దోమలు) మాత్రమే మానవులను కుట్టి రక్తాన్ని పీలుస్తాయి. మగదోమలు మొక్కల రసాలను ఆహారంగా గ్రహిస్తాయి.
- 'ఆడ అనాఫిలిస్ దోమ' మానవుడిని కుట్టినపుడు, 'చలత్సిద్ధబీజ' లేక 'స్పోరోజాయిట్' దశలో ఉన్న మలేరియా పరాన్నజీవి మానవుని రక్తంలోకి చేరుతుంది.
- ఈ 'స్పోరోజాయిట్లు' సుమారు '30' నిమిషాలు రక్తంలో గడిపి ఆ తరువాత కాలేయ కణాలలోకి చేరుతాయి.

గామిటో సైట్లు రెండు రకాలుగా ఉంటాయి. అవి :
1. స్థూల సంయోగ బీజమాతృకలు (మాక్రో గామిటోసైట్,
2) సూక్ష్మ సంయోగ బీజమాతృకలు (మైక్రో గామిటోసైట్లు)

మానవునిలో పరాన్న జీవి జీవిత చక్రము

ప్రీ-ఎరిత్రోసైటిక్ వలయం

- ఇది కాలేయ కణాల్లో జరుగుతుంది.
- కాలేయ కణంను చేరిన 'స్పోరోజాయిట్లు', కాలేయ కణ పదార్థాలను ఆహారంగా తీసుకొని ఆ కణాన్ని అంతటిని ఆక్రమించి "క్రిప్టో-షైజాంట్‌ట్'గా మారును. ఈ షైజాంట్లు అలైంగికంగా 'క్రిప్టో - మీరోజాయిట్ల'నే పిల్ల కణాలను ఉత్పత్తి చేస్తాయి. కాలేయపు కణం పగిలి మీరోజాయిట్లు రక్తంలోకి విడుదలవుతాయి.
- వీటిలో కొన్ని కొత్త కాలేయపు కణాలను చేరి అధిక సంఖ్యలో క్రిప్టో మీరోజాయిట్లను ఉత్పత్తి చేస్తే, మరికొన్ని ఎర్రరక్త కణాల్లో చేరతాయి. ఈ జీవిత చక్రపు పరిమితి 7-17 రోజులు.
- పరాన్న జీవి ఎర్ర రక్త కణాల్లోకి ప్రవేశించగానే ఈ భాగపు జీవ చక్రం ముగుస్తుంది.

ఎరిత్రోసైటిక్ వలయం

- ఇది ఎర్రరక్త కణాల్లో జరుగుతుంది.
- ఎర్రరక్త కణంలోకి ప్రవేశించిన పరాన్నజీవి రక్త కణంలోని పదార్థాన్ని ఆహారంగా తీసుకొని ఆ కణాన్ని అంతటిని ఆక్రమించి 'షైజాంట్'గా మారుతుంది.
- ప్రతి షైజాంట్ వరుసగా విభజనలు చెంది '6-24' మీరోజాయిట్లను ఉత్పత్తి చేస్తాయి. ఎర్రరక్త కణం పగిలి, దాని నుండి మీరోజాయిట్లు రక్తంలోకి విడుదలవుతుంది.
- ఈ మీరోజాయిట్లు తిరిగి కొత్త ఎర్రరక్త కణాలను చేరి, మరింత అధిక సంఖ్యలో మీరోజాయిట్లను ఉత్పత్తి చేస్తాయి.
- ఎర్రరక్తకణం పగిలి, దాని నుంచి పరాన్నజీవి రక్తంలోకి విడుదలైనప్పుడు 'చలి, జ్వరం' వస్తుంది. దీనినే 'మలేరియా జ్వరం' అంటారు.

మలేరియా-జీవిత చరిత్ర

2 అతిథేయులు

దోమ
ఇది 'ప్రధాన అతిథేయు'.
పరాన్నజీవులు లైంగిక ప్రత్యుత్పత్తిద్వారా సంఖ్యలో అభివృద్ధి చెందుతాయి. కాబట్టి దీనిని 'లైంగిక చక్రము' అంటారు.

మానవుడు
ద్వితీయ లేక మాధ్యమిక అతిథేయి
పరాన్న జీవులు అలైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా సంఖ్యను వృద్ధి చేసుకుంటాయి. కాబట్టి ఇది 'అలైంగిక వలయం'



Tonsils and Throat

రేపు : జీవశాస్త్ర బోధనా లక్ష్యాలు

సంపాదకీయం

పాపం పసివారు...

వేసవొచ్చిందంటే పిల్లలకు పండగ. చిన్నారుల ఆనందానికి అవధులుండవు. పేరెంట్స్ కాస్తంత ఏమరపాటుకు పోతే ఘోర విషాదాలు సంభవిస్తున్నాయి. ముక్కుపచ్చలారని పసి కూనలు నిష్కారణంగా సమిధలవుతున్న ఘోరాలు తల్లిదండ్రుల, కుటుంబ సభ్యులతోపాటు ప్రతి ఒక్కరి గుండెలవిస్తున్నాయి. గడచిన వారం పది దినాల్లో ప్రసార మాధ్యమాల్లో కనిపిస్తున్న వినిపిస్తున్న వరుస ప్రమాదాలు చిన్నారులను చిదిమేయడం మిక్కిలి ఆవేదనా భరితం. వేసవి శెలవుల సందర్భంగా పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్ పాతబస్తీకొచ్చిన ఒక కుటుంబం ఇంటిలో లేచిన అగ్ని కీలలు 17 మందిని నిలువునా దహించివేయగా చనిపోయిన వారిలో ఎనిమిది మంది అభం శుభం ఎరగని పిల్లలు కావడం అత్యంత బాధాకరం. మంటలు, పొగ నుంచి తప్పించుకునే దారి లేక అక్కడికక్కడే అశువులు బాశారు. కరెంట్ షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదానికి హేతువని చెబుతున్నారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించలేదన్న ఆరోపణలు చక్కర్లు కొడుతున్నాయి. అత్యంత ఆందోళనకర విషయమేమంటే, సరైన ఫైర్ సేఫ్టీ సదుపాయాలు లేని ఇలాంటి భవనాలు హైదరాబాద్ విశ్వనగరంలో లక్షల్లో ఉన్నాయన్న ఉన్నతాధికారుల ఉటంకింపు. వాటన్నింటినీ తనిఖీ చేయడం అసాధ్యమని, పౌరులే భద్రతా చర్యలు చేపట్టాలని ఉచిత సలహా పడేశారు. ప్రమాదం ఏదైనా ముందుగా ప్రభుత్వాలు ప్రజలపై ఎదురుదాడి చేసి తప్పించుకోవడం ఎక్కడైనా పరిపాటైంది.

ఆటకని కారెక్కిన నలుగురు చిన్నారులు డోర్‌లాక్ కావడంతో ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలొదిలిన దారుణం విజయనగరం జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ పిల్లల హఠాత్ మరణాలు ఊహకందనివి. కన్నవారి కడుపు కోత ఎంతకీ మర్చిపోనిది. అదే రోజున చిత్తూరు జిల్లాలో నీటికుంటలో పడి ముగ్గురు అమాయక పసికందుల ప్రాణాలు గాలిలో కలిసిపోగా, ఏలూరు జిల్లాలో అన్నాతమ్ములు చనిపోయారు. ఒక్క ఆదివారంనాడే తెలుగు రాష్ట్రాల్లో 16 మంది పిల్లలు అర్థాంతరంగా తనువు చాలించడాన్ని ఏ విధమైన విషాదమో చెప్పతరం కాదు. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో సరదాకి ఈతకెళ్లిన ఐదుగురు చిన్నారులు చెరువులో మునిగి అనంతలోకాల్లో కలిసి పోయారు. బోరుబావుల్లో కూరుకుపోయి, విద్యుద్ఘాతాలకు గురై, సముద్రాల్లో, నదుల్లోకి ఈతకెళ్లడం వంటి ఘోరాలు తరచూ చూస్తునే ఉన్నాం. అత్యంత విషాదమేంటంటే క్రికెట్ ఆడటానికి మైదానానికెళ్లిన పిల్లల నెత్తిన పిడుగులు పడి కబళించడం. ఈ ఉత్పాతాన్ని ఎవరు మాత్రం ముందుగా ఊహిస్తారు!

నయా–ఉదారవాద ప్రభావాలు పిల్లలను పొట్టనపెట్టుకుంటున్నాయి. ప్రసార మాధ్యమాల్లో, సినిమాల్లో చూపించే సాహసకృత్యాలను నిజమే కాబోలనుకొని ఫీట్లు చేసి కాళ్ల చేతులు విరగ్గొట్టుకున్న, ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు తెచ్చుకున్న ఉదంతాలనేకం. గతంలో పిల్లలపై దుష్ఫలితాలు కలిగించే కార్పొరేట్ సంస్థల వాణిజ్య ప్రకటనలను నిలిపివేయాలన్న ఆందోళన వచ్చింది. కొన్ని యాడ్‌లను అప్పట్లో రద్దు చేశారు కూడా. ఎఐ, ఐటి, సోషల్ మీడియా యుగంలో పిల్లల మెదళ్లను కలుషితం చేసే ఎన్నో కార్యక్రమాలను ఆయా సంస్థలు అధికారికంగా, అనధికారికంగా వండి వారుస్తున్నాయి. అలివికాని విన్యాసాలతో రీల్స్ చేయాలన్న, సెల్ఫీలు, ఆన్‌లైన్ గేమ్‌లు, పోర్న్ వీడియోలపై పిల్లల్లో కుతూహలాన్ని కలిగిస్తున్నాయి. అటువంటి వాటికి ప్రభుత్వాలు, కొంత మంది పెద్దలు సైతం మద్దతివ్వడం సమాజానికి పట్టిన చీడ. ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా ముందు చిక్కుకునేది చిన్నారులే. పిల్లలపై లైంగిక వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ, అక్రమ రవాణా, పేరెంట్స్ బంధువులే పేదరికం, ఆర్థిక ఇబ్బందులతో, ఇతర కారణాలతో కన్నవారిని కడతేర్చే సంఘటనలు అక్కడక్కడ కనిపించేవే. పోక్సో చట్టం, బాలల హక్కులను రక్షించే పలు చట్టాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పాలకులచేత సమర్ధవంతంగా అమలు చేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులది, సమాజానిది. అప్రమత్తతే బాలలకు రక్షణ కవచం. నేటి బాలలే రేపటి జాతి నిర్మాతలని గుర్తెరగాలి.

మహనీయుని మాట

భూమిని పంచడమంటే...
అధికారాన్ని పంచడమే.
- ఎస్.ఆర్. శంకరన్,
మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి.

నాజీల ఓటమికి కారణాలు - సామ్రాజ్యవాదుల కట్టుకథలు

ప్రజాప్రస్థానం

> ఆ యుద్ధంలో బ్రిటన్ సుమారు 5 లక్షల మంది ప్రజల ప్రాణాలను కోల్పోయింది. వారిలో సైనికులు, పౌరులు కూడా ఉన్నారు. అమెరికా అంతకన్నా తక్కువ సంఖ్యలోనే ప్రాణ నష్టాన్ని చవి చూసింది. దీనిని సోవియట్ యూనియన్‌తో పోల్చి చూడండి. ఆ దేశం 2 కోట్ల 70 లక్షల మంది ప్రజల ప్రాణాలను కోల్పోయింది. కాని ఈ వాస్తవం పాశ్చాత్య దేశాల ప్రజల జ్ఞాపకాల్లో ఎక్కడా మిగలలేదు. వాస్తవానికి యుద్ధంలో ఎంతెంతమంది ప్రాణాలను త్యాగం చేశారన్నది ప్రధానం కాదు. ఆ సంఖ్య ఎంత తక్కువైనా, వారి త్యాగాలను గౌరవించాల్సిందే. కాని పాశ్చాత్య దేశాల ప్రజానీకం జ్ఞాపకాల్లో సోవియట్ ప్రజల అపార త్యాగాలకు ఏ స్థానమూ లేకపోవడం మాత్రం చాలా అన్యాయం.

నాజీ జర్మనీని ఓడించినది ప్రధానంగా సోవియట్ యూనియన్. తమ మాతృ దేశ రక్షణ కోసం సోవియట్ ప్రజలు చేసిన అపార త్యాగాలు ఎవరి ఊహలకూ అందనంత స్థాయిలో ఉన్నాయి. ఐతే, మొదటినుంచీ పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ఈ సత్యాన్ని ఏదో ఒక విధంగా మరుగుపరిచి నాజీ జర్మనీ ఓటమికి కారణం తాము చేసిన ప్రయత్నాలే అని చెప్పుకోడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. ప్రారంభంలో ఈ ప్రయత్నం చాప కింద నీరులాగా సాగింది. అప్పట్లో కనీసం ఆ పశ్చిమ దేశాల ప్రజలు కూడా వారి ప్రచారాన్ని విశ్వసించలేదు. ఇక ఆ పశ్చిమ దేశాల మేధావులైతే ప్రత్యక్షంగా ఆ యుద్ధాన్ని చూసినవారు గనుక అది ఎలా పరిణమించిందో తెలుసు గనుక ఈ తప్పుడు ప్రచారం వారి వద్ద చెల్లలేదు.

నేను వ్యక్తిగతంగా పొందిన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. ప్రొఫెసర్ జోన్ రాబిన్సన్ ప్రఖ్యాత వామపక్ష కీన్షియన్ ఆర్థికవేత్త. పలు కేంబ్రిడ్జి సెమినార్లలో ఆమెతోబాటు పాల్గొన్నాను. ఆ సెమినార్లలో ఎవరైనా సోవియట్ యూనియన్ మీద చేసిన విమర్శలు శృతి మించినప్పుడు ఆమె "సోవియట్ యూనియనే గనుక లేకుంటే మనం ఇప్పుడు ఇలా సెమినార్లలో కూర్చుని వుండగలిగేవాళ్ళం కాదు" అని గట్టిగా స్పందించేవారు. ఆమె తండ్రి ఒక ప్రఖ్యాత బ్రిటిష్ సైనిక జనరల్. అతను ఏ రకంగా చూసినా కమ్యూనిస్ట్ అనుకూలుడు కాడు. కాని అతడి కుమార్తెకు నాజీలపై పోరులో సోవియట్ యూనియన్ పాత్ర గురించి ఇటువంటి అభిప్రాయం ఉండేది. ఇదే విధమైన అభిప్రాయాన్ని చాలామంది పశ్చిమ దేశాల విద్యావేత్తలు కలిగివుండేవారు. ఐతే కాలం గడుస్తున్నకొద్దీ, కొత్త తరాలు రంగం మీదకు వస్తున్నకొద్దీ, సోవియట్ యూనియన్ పాత్రను మరుగుపరిచే కట్టుకథలకు బలం పెరిగింది. ఈ కొత్త తరాల వారు ఆ యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసినదీ లేదు, దాని గురించిన విషయ పరిజ్ఞానమూ వారికి లేదు. అందుకే ఈ కట్టుకథల ప్రభావం పెరుగుతూ వచ్చింది.

ప్రభాత్ పట్నాయక్

ఈ విధంగా సత్యాన్ని మరుగుపరిచే విషయంలో హాలీవుడ్ కూడా తెలిసో తెలియకో తన వంతు పాత్ర పోషించింది. హాలీవుడ్‌లో నిర్మించిన పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలు –'ది లాంగెస్ట్ డే', 'ది గన్స్ ఆఫ్ నవ్రాన్, మొదలు 'సేవింగ్ ప్రైవేట్ రియాన్' వరకూ–పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు నాజీలకు వ్యతిరేకంగా ఎలా 'గొప్పగా' పోరాడారో, ఏ విధంగా నాజీలను ఓడించారో ఆ చిత్రాల్లో చూపించారు. ఈ చిత్రాలు పశ్చిమ దేశాల ప్రేక్షకుల కోసం ప్రధానంగా ఉద్దేశించబడ్డాయి. అందుకే ఆ చిత్రాల మౌలిక కథనాలు ఆ విధంగా ఉన్నాయి. కాని రెండవ ప్రపంచ యుద్ధం ప్రధానంగా నాజీ జర్మనీకి, పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలకు నడుమ జరిగినట్టు, నాజీలను, దాని మిత్రులను పశ్చిమ దేశాలు ఓడించినట్టు జరుగుతున్న తప్పుడు ప్రచారానికి ఆ చిత్రాలు బలాన్ని చేకూర్చాయి.

ఆ యుద్ధంలో బ్రిటన్ సుమారు 5 లక్షల మంది ప్రజల ప్రాణాలను కోల్పోయింది. వారిలో సైనికులు, పౌరులు కూడా ఉన్నారు. అమెరికా అంతకన్నా తక్కువ సంఖ్యలోనే ప్రాణ నష్టాన్ని చవి చూసింది. దీనిని సోవియట్ యూనియన్‌తో పోల్చి చూడండి. ఆ దేశం 2 కోట్ల 70 లక్షల మంది ప్రజల ప్రాణాలను కోల్పోయింది. కాని ఈ వాస్తవం పాశ్చాత్య దేశాల ప్రజల జ్ఞాపకాల్లో ఎక్కడా మిగలలేదు. వాస్తవానికి యుద్ధంలో ఎంతెంతమంది ప్రాణాలను త్యాగం చేశారన్నది ప్రధానం కాదు. ఆ సంఖ్య ఎంత తక్కువైనా, వారి త్యాగాలను గౌరవించాల్సిందే. కాని పాశ్చాత్య దేశాల ప్రజానీకం జ్ఞాపకాల్లో సోవియట్ ప్రజల అపార త్యాగాలకు ఏ స్థానమూ లేకపోవడం మాత్రం చాలా అన్యాయం.

పశ్చిమ దేశాలు ఆ యుద్ధం ముగిసిన తర్వాత మొదలుబెట్టిన ప్రచ్ఛన్న యుద్ధ వ్యూహానికి ఇది చాలా ఉపయోగపడింది. సోవియట్ యూనియన్ త్యాగాలను మరుగుపరచడంతోబాటు, సామ్రాజ్యవాద దేశాలు మరొక దుర్మార్గమైన ప్రచారానికి తెర తీశారు. సోవియట్ యూనియన్ విస్తరణ కాంక్షతో ఉందని, పశ్చిమ యూరప్‌ను ఆక్రమించుకోడానికి పథకాలు పన్నుతోందని వారు ప్రచారం మొదలుబెట్టారు. అప్పుడే ముగిసిన యుద్ధంలో ఏకంగా 2 కోట్ల 70 లక్షల మందిని పోగొట్టుకుని భారీ స్థాయిలో వినాశనాన్ని చవిచూసిన సోవియట్ యూనియన్ అంత త్వరలో ఏవిధంగా విస్తరణకు పూనుకుంటుంది? ఈ ఇంగిత జ్ఞానం కూడా పశ్చిమ దేశాల ప్రచారకులకు లేదు. విన్‌స్టన్ చర్చిల్ వంటి పక్కా సామ్రాజ్యవాది నాయకత్వంలో సోవియట్ వ్యతిరేక ప్రచారానికి పూనుకున్నారు. యూరప్‌కు సోవియట్ నుండి ప్రమాదం పొంచి వుందని పాట ఎత్తుకున్నారు. నిజానికి యూరప్ దేశాల పాలకవర్గాల ఆధిపత్యానికి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో అంతర్గతంగానే తీవ్ర సవాలు ఎదురైంది. దానిని తిప్పికొట్టడానికి ఆ పాలకవర్గాలు ప్రజలకు పలు రాయితీలను ఇవ్వవలసి వచ్చింది. అటువంటి రాయితీలలో సంక్షేమ రాజ్యం అనేది ఒకటి. దేశీయంగా సంక్షేమ రాజ్యాన్ని ఏర్పరచడంతోబాటు తమ ఆధీనంలో ఉన్న వలసలకు స్వతంత్రాన్ని ఇవ్వడం రెండవది (ఈ రెండవ చర్యకు చర్చిల్ పూర్తి వ్యతిరేకి).

వాస్తవానికి యాల్టాలో, పోట్స్‌డామ్ సమావేశాల్లో కుదిరిన అవగాహనకు సోవియట్ యూనియన్ పూర్తిగా కట్టుబడి వ్యవహరించింది (ఫాసిస్టు కూటమికి వ్యతిరేకంగా పోరాడుతున్న శక్తులు ఈ రెండు సమావేశాల్లో పాల్గొన్నాయి). వాస్తవానికి గ్రీస్‌లో విప్లవం ఆ కాలంలో తలెత్తినప్పుడు దానికి సహాయంగా నిలవడానికి సోవియట్ యూనియన్ ముందుకు రాలేదు. ఆ కారణంగా గ్రీక్ విప్లవం ఓటమిపాలైంది. ఐనా సరే, సామ్రాజ్యవాదులు మాత్రం సోవియట్ యూనియన్‌ను ఒక భూతంగా చిత్రించడం మాత్రం మానుకోలేదు. ఆ ప్రచారం ద్వారా పశ్చిమ దేశాల పాలకవర్గాలు తమ ఆధిపత్యానికి ఎదురౌతున్న సవాలును తట్టుకోడానికి ప్రయత్నించారు.

> పశ్చిమ దేశాలు ఆ యుద్ధం ముగిసిన తర్వాత మొదలుబెట్టిన ప్రచ్ఛన్న యుద్ధ వ్యూహానికి ఇది చాలా ఉపయోగపడింది. సోవియట్ యూనియన్ త్యాగాలను మరుగుపరచడంతోబాటు, సామ్రాజ్యవాద దేశాలు మరొక దుర్మార్గమైన ప్రచారానికి తెర తీశారు. సోవియట్ యూనియన్ విస్తరణ కాంక్షతో ఉందని, పశ్చిమ యూరప్‌ను ఆక్రమించుకోడానికి పథకాలు పన్నుతోందని వారు ప్రచారం మొదలుబెట్టారు. అప్పుడే ముగిసిన యుద్ధంలో ఏకంగా 2 కోట్ల 70 లక్షల మందిని పోగొట్టుకుని భారీ స్థాయిలో వినాశనాన్ని చవిచూసిన సోవియట్ యూనియన్ అంత త్వరలో ఏవిధంగా విస్తరణకు పూనుకుంటుంది? ఈ ఇంగిత జ్ఞానం కూడా పశ్చిమ దేశాల ప్రచారకులకు లేదు.

బ్రిటిష్ వలసగా భారతదేశం ఉన్నప్పుడు ఇక్కడి ప్రజల నుండి బలవంతంగా చేయించిన త్యాగాలు పశ్చిమ దేశాలు అన్నీ కలిసి రెండో ప్రపంచ యుద్ధంలో చేసి త్యాగాలకన్నా చాలా ఎక్కువ అన్నది చాలా మంది గుర్తించరు. ఆ యుద్ధంలో తూర్పు రంగాన బ్రిటన్ జపాన్‌తో తలపడవలసి వచ్చింది. అందుకయ్యే ఖర్చులో అత్యధిక భాగాన్ని అప్పటి భారతదేశం లోటు బడ్జెట్ ద్వారా భరించింది. ఆ యుద్ధంలోకి భారతీయులు వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే బలవంతంగా లాగబడ్డారు. భారతదేశం నుండి యుద్ధ ఖర్చుల నిమిత్తం బ్రిటన్ బలవంతంగా రుణాలు తీసుకుంది. ఆ రుణాలను న్యాయంగా ఇండియాకు తిరిగి చెల్లించాల్సి వుంది. కాని యుద్ధం ముగిసిన చాలా కాలం వరకూ తిరిగి చెల్లించనేలేదు. బడ్జెట్‌లో ఏర్పడిన లోటు కారణంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో అప్పుడు ఎటువంటి రేషనింగు విధానమూ లేదు. దాంతో బెంగాల్ గ్రామీణ ప్రాంతాల్లో విపరీతమైన కరువు ఏర్పడింది. ఆ కరువుకు 30 లక్షల మంది బలయ్యారు (అదే బ్రిటన్‌లో మొత్తం యుద్ధకాలం అంతటికీ 5 లక్షల మంది మాత్రమే మరణించారు). ధరల పెరుగుదల కారణంగా బ్రిటన్ ఇండియాకు తిరిగి చెల్లించవలసిన రుణం విలువ బాగా పడిపోయింది. దానికి తోడు పౌండు విలువను 1949లో తగ్గించారు. రుణం పౌండ్ల లెక్కల్లో ఉన్నందున వాస్తవంగా ఇండియాకు దక్కినది అసలు రుణంలో కొద్ది భాగం మాత్రమే. యుద్ధంలో పాల్గొనడానికి ఏ మాత్రమూ సంసిద్ధం కాకపోయినా, బ్రిటన్ అనుసరించిన విధానం వలన 30 లక్షల మంది బెంగాలీ ప్రజలు ఆ యుద్ధానికి బలైపోయారు.

ఇప్పుడు నాజీలను ఓడించడంలో సోవియట్ యూనియన్ పాత్రను కప్పిపుచ్చే ప్రయత్నం ట్రంప్ హయాంలో తారాస్థాయికి చేరింది. నిజానికి నాజీ జర్మనీని ఓడించినది ప్రధానంగా అమెరికాయేనని పచ్చి అబద్ధాలను అడ్డగోలుగా ట్రంప్ ప్రకటించేస్తున్నాడు. కొత్త తరం యువతకు ఆ యుద్ధానికి సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలియకపోవచ్చు. కాని 1946లో పుట్టిన ట్రంప్ కు యుద్ధానంతర కాలపు జీవితంతో ప్రత్యక్షానుభవం ఉంది. ఐనా, ఇలా సిగ్గు లేకుండా పచ్చి అబద్ధాలను వాగడం ట్రంప్ కే చెల్లింది. యుద్ధం ముగిసిన తర్వాత సామ్రాజ్యవాదులు మొదలుబెట్టిన తప్పుడు ప్రచారానికి ఇది కొనసాగింపే.

ఈ ఏడాది నాజీ జర్మనీపై విజయం సాధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాస్కోలో విజయోత్సవాలు నిర్వహించారు. వాటిలో పాల్గొనడానికి అప్పటి మిత్ర దేశాలైన బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలకు రష్యా ఆహ్వానం పంపింది. కాని సామ్రాజ్యవాద దేశాలు ఆ ఉత్సవాలను బహిష్కరించాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని అవి సాకుగా చూపించి ఉత్సవాలకు ఎగనామం పెట్టాయి. నిజానికి ఆనాటి యుద్ధంతో పుతిన్‌కు ఏ సంబంధమూ లేదు. కాని అప్పటి ఘన విజయాన్ని ఇప్పుడు సంబరంగా జరుపుకుని ఆ ఖ్యాతిలో వాటా కొట్టేద్దామని పుతిన్ తాపత్రయ పడుతున్నాడు. అంతమాత్రం చేత సామ్రాజ్యవాద దేశాలు ఆ ఫాసిస్టు వ్యతిరేక విజయోత్సవాలను బహిష్కరించడం సమర్ధనీయం కానే కాదు. పోనీ అలా బహిష్కరించడానికి వారు అప్పటి సోవియట్ యూనియన్‌కు ఇప్పటి పుతిన్‌కు తేడా ఉందని ఏమైనా వాదన ముందుకు తెచ్చారా అంటే అదీ లేదు.

ఐతే ఈ సందర్భంలో ఒక విషయాన్ని మనం గుర్తించాలి. కేవలం చైనా, వియత్నాం, క్యూబా వంటి సోషలిస్టు దేశాలు మాత్రమే కాకుండా చాలా మూడవ ప్రపంచ దేశాలు ఈ విజయోత్సవాలకు హాజరయ్యాయి. వాటిలో బ్రెజిల్, వెనిజులా, బుర్కినా ఫాసో (ఈ దేశం ఇప్పుడు ఫ్రెంచి–అమెరికన్ సామ్రాజ్యవాదంతో తలపడుతోంది) వంటి దేశాలు ఉన్నాయి. ఈ ఉత్సవాలలో భారతదేశం పాల్గొనలేదు. ఇదేమీ ఆశ్చర్యం కలిగించేది కాదు. ప్రస్తుత ప్రభుత్వ అధినేతల హిందూత్వ వాదానికి మూలాలు ముస్సోలినీ, హిట్లర్‌ల దగ్గర నుంచి సంక్రమించాయి. ఆ యుద్ధ కాలంలో హిందూత్వ వాదులు నాజీలకు మద్దతుగా వ్యవహరించారు. ప్రపంచం లోని అత్యధిక మెజారిటీ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా నిలిచారు.

ఇక్కడ ఇంకొక అంశాన్ని కూడా చూడాలి. చాలా దేశాల్లో ఫాసిస్టు శక్తులు తిరిగి అధికారంలోకి వస్తున్నాయి. ఇటువంటి సమయంలో ఫాసిస్టు–వ్యతిరేక ఉత్సవాలలో పాలుపంచుకోవడం పశ్చిమ దేశాల సామ్రాజ్య వాదులకు ప్రాధాన్యతాంశంగా ఉండదు. ఎందుకంటే సామ్రాజ్యవాద శక్తులు ఈ ఫాసిస్టు శక్తులలో చాలా వాటితో పొత్తులకు సుముఖంగా ఉన్నారు. ఇలా ఉన్నవారిలో డొనాల్డ్ ట్రంప్ అందరికన్నా ముందుంటాడు. అతగాడి అనుంగు మిత్రుడు ఎలన్ మస్క్ జర్మన్ నయా నాజీ పార్టీ అయిన ఎ.ఎఫ్.డి కి వీరాభిమాని. రష్యాతో ప్రస్తుతం యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్ ప్రభుత్వానికి సామ్రాజ్యవాద దేశాల మద్దతు ఉంది. ఆ ఉక్రెయిన్ ప్రభుత్వం నిండా స్టెపాన్ బండేరా అనుయాయులు ఉన్నారు. ఈ స్టెపాన్ బండేరా రెండో ప్రపంచ యుద్ధ కాలంలో తమను ఆక్రమించుకోడానికి వచ్చిన నాజీలకు బంటుగా వ్యవహరించాడు.

నాజీలపై సాధించిన విజయం యొక్క కీర్తిలో వాటా కొట్టేద్దామని పుతిన్ ప్రయత్నిస్తూండవచ్చు. కాని అతగాడికి ఆ యుద్ధంలో సోవియట్ యూనియన్ సాధించిన విజయం ఎంత ఘనమైనదో అది కనీసం బోధపడింది. కాని పశ్చిమదేశాల సామ్రాజ్యవాదులకు ఆపాటి కూడా బోధ పడలేదు.

(స్వేచ్ఛానుసరణ)

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

విశ్లేషణ

> మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది. మరోవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నమ్ముకుని జీవిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను దఫదఫాలుగా తొలగించే ప్రక్రియను యాజమాన్యం ముమ్మరం చేసింది. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని, కూటమికి మద్దతిచ్చి గెలిపించండని ఎం.పి శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వేడుకుంటే అత్యధిక మెజార్టీతో విశాఖ ప్రజలు గెలిపిస్తే... నేడు స్టీల్‌ప్లాంట్ గురించి, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయడం గురించి మాట్లాడకపోవడం అన్యాయం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తన బాధ్యత నిర్వర్తించాలి. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించి...కార్మికులకు, ఉత్తరాంధ్ర ప్రజానీకానికి భరోసా కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ మనుగడ ప్రశ్నార్ధకంగా మారబోతున్నది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. 1650 కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. మరో 1500 మంది పని చేసిన చోట టెండర్లు రెన్యువల్ చేయక కార్మికులను నడిరోడ్డుపై పడేశారు. తొలగించటం, శాశ్వత ఉద్యోగులను స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ద్వారా బలవంతంగా బయటకు పంపించే చర్యలు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్‌కి ప్రయోజనం చేకూరడంలేదు. పైగా ప్యాకేజీ ఇచ్చిన సందర్భంగా అనేక షరతులు విధించిందనేది నగ్నసత్యం. సొంత గనులు కేటాయించకుండా, సెయిల్‌లో విలీనం చేయకుండా స్టీల్‌ప్లాంట్‌కు ప్రయోజనంలేదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. మరోవైపు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఆగమేఘాల మీద భూములు కేటాయింపు, ఎన్.ఎం.డి.సితో చర్చించి సొంత గనులు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు. పనిలో పని మిట్టల్ కంపెనీకి క్యాపిటివ్ పోర్టు నిర్మాణానికి భూములు కేటాయింపు, అనుమతులిచ్చారు. ఇప్పటికే అదాని పోర్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ని ఇబ్బందులు పెట్టాలో అన్ని పెడుతున్నది. మిట్టల్ పోర్టు వచ్చిన తరువాత విశాఖ పోర్టుని బలహీనపర్చే చర్యలకు పూనుకుంటాయి. దీనిని ప్రశ్నిస్తున్న కార్మిక నాయకుల మీద కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ప్లాంట్ పరిరక్షణ కోసం భోజన విరామ సమయంలో కార్మికులను కలుస్తున్న నాయకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, భయభ్రాంతులకు గురిచేయడం సాధారణ విషయంగా మారిపోయింది.



కె.లోకనాథం

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, పోర్టు నిర్మాణం కోసం రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం చేసింది. గత 15 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పెట్రో కెమికల్ పెట్రో ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పిసిపిఐఆర్) పేరుతో భూసేకరణ మొదలు పెట్టారు. దీనికి ప్రజల నుండి వ్యతిరేకత రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ–చెన్నై కారిడార్ పేరుతో భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే 5500 ఎకరాల భూములు రైతులు వద్ద నుండి ఏపీఐఐసీ సేకరించింది. దీనిపై లబ్ధిదారులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా న్యాయమైన తీర్పు వెలువడింది. దీనిని కూడా అమలు చేయకుండా అనేక ఇబ్బందులకు గురి చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆగమేఘాల మీద స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ప్రైవేట్ కంపెనీలకు భూపందేరం ప్రారంభించారు. అందులో భాగంగా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వకుండానే ఇక్కడ సమీకరించిన భూములలో ఉన్న జీడి, మామిడి, కొబ్బరి వంటలను హఠాత్తుగా తొలగిస్తూ రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. స్థానిక ప్రజలు ప్రతిఘటించడంతో ప్రభుత్వ సర్వేలు నిర్వహించి చెట్లకు నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వ యంత్రాంగం హామీ ఇచ్చింది. ఇటీవల విశాఖ పర్యటన సందర్భంగా ప్రధాని బల్క్ డ్రగ్ పార్కును వర్చువల్‌గా శంకుస్థాపన చేసినప్పుడు ప్రజలు తీవ్ర నిరసనను వ్యక్తంచేశారు.

ఇప్పటికే హెట్రో డ్రగ్స్ మందుల కంపెనీ వల్ల పర్యావరణం, నీరు విషతుల్యమై స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సముద్రంలో మత్స్య సంపద లేక మత్స్యకారులకు వేట లేక పూరి, శ్రీశైలం వంటి ప్రాంతాలకు వలసలు పోతున్నారు. కంపెనీ వల్ల స్థానిక ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారు. మళ్ళీ బల్క్ డ్రగ్ పార్క్ వస్తే తమ జీవితాలకు గ్యారెంటీ లేదనే భావంతో ప్రజలు నిరసన తెలియజేస్తున్నారు. అదే సందర్భంలో 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అనేక అవాంతరాలు సృష్టిస్తున్నది.

ప్రభుత్వం సేకరించిన భూములలో నిప్పన్ ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు, దానికి కావాల్సిన సొంత గనుల కోసం ఎన్.ఎం.డి.సి తో మాట్లాడి ఐరన్ ఓర్ గనులు కేటాయిస్తున్నట్లు ప్రకటనలు వస్తున్నాయి. దీనితోపాటు మిట్టల్‌కు సొంత క్యాప్టివ్ పోర్టు నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఒక ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ పూర్తి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తన భుజస్కందాల మీద వేసుకొని మోస్తున్నది! గతంలో డి.ఎల్ పురం ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి అనువైనది కాదని, ఈ ప్రాంతం సుడిగుండాల ప్రాంతమని, ఇక్కడి సముద్ర తీరం సహకరించదని, రామయ్యపట్నం ప్రాంతం అయితే మంచిదని నాటి మంత్రి గంటా శ్రీనివాసరావు మంజూరైన పోర్టును అటువైపుగా మళ్ళించారు. నేడు మళ్ళీ ఆర్సెలార్ మిట్టల్‌కు ఉపయోగపడే విధంగా పోర్టు నిర్మాణం చేయాలని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం వెనుక ప్రజల ప్రయోజనాల కన్నా మిట్టల్ ప్రయోజనం దాగి ఉన్నదని స్పష్టమవుతుంది. ఈ పోర్టు నిర్మాణం తీర ప్రాంతం గుండా మూడు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి మత్స్య వేట జరపరాదని దానిలో పేర్కొన్నారు. మత్స్యకారులకు తీవ్రమైన నష్టం ఏర్పడబోతుంది. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరిగితే వచ్చే లాభనష్టాలు, పర్యావరణం మీద దాని ప్రభావం వంటి అంశాలకు సంబంధించి ఇ.ఐ.ఎ రిపోర్టు తయారు చేసిన దాఖలాలు లేవు. మరోవైపు దేశ భద్రత కోసం ఎన్.ఎ.ఓ.బి నిర్మాణం జరుగుతున్నది. దానికి అతి చేరువలోనే ఈ నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు. ఈ భూములు సేకరించింది ఒకదాని కోసం అయితే రాష్ట్ర ప్రభుత్వం మరొకదాని కోసం ఉపయోగించడం చట్టరీత్యా నేరమని మాజీ ఐఎఎస్ అధికారి ఇ.ఎ.ఎస్.శర్మ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత పోర్టు నిర్మాణం చేసుకుంటామని అనేక వినతులు పెట్టుకున్నా స్పందించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ యాజమాన్యానికి కట్టబెట్టారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు అనుమతులు ఇవ్వలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత పోర్టు, గనులు వుండి వుంటే మరో లక్ష మందికి ఉపాధి అవకాశాలు అందుతాయన్నది నగ్న సత్యం. నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడే దశకు కేంద్ర బిజెపి ప్రభుత్వం నెట్టింది. చివరికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం కూడా ఆర్సెల్ మిట్టల్ మీద ఉన్న ప్రేమతో... 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుండా నట్టేట్లో ముంచే ప్రయత్నం చేస్తున్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది. మరోవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నమ్ముకుని జీవిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను దఫదఫాలుగా తొలగించే ప్రక్రియను యాజమాన్యం ముమ్మరం చేసింది. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని, కూటమికి మద్దతిచ్చి గెలిపించండని ఎం.పి శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వేడుకుంటే అత్యధిక మెజార్టీతో విశాఖ ప్రజలు గెలిపిస్తే...నేడు స్టీల్‌ప్లాంట్ గురించి, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయడం గురించి మాట్లాడకపోవడం అన్యాయం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తన బాధ్యత నిర్వర్తించాలి. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించి... కార్మికులకు, ఉత్తరాంధ్ర ప్రజానీకానికి భరోసా కల్పించాలి.

/ వ్యాసకర్త సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు /

కవిత్వం

ధాన్యం విలవిల

ధాన్యరాశి విలవిలాడింది
కుప్పకొచ్చిన గింజ నలిగిపోతుంటే
రేటు రాని కాలాన్ని పట్టుకుని
వెక్కిళ్లు పెట్టింది
తడిసిపోయి తంటాలు పడుతుంటే
తల తిప్పి చూడని తీరును చూసి
లోలోపల కుమిలిపోయింది.

రైతు ముఖంలో ఆందోళన
నానాటికీ పెరిగిపోతూ కనిపిస్తుంటే
దుక్కి దున్నిన నాగలి
కన్నీటి పర్యంతమై రగిలిపోయింది
చేతికొచ్చిన పంట నోటికి రాకపోయేసరికి
పంట చేలు పడి పడి ఏడ్చింది
వేసిన సత్తువ కాలువ పాలు అవుతుంటే
నేలతల్లి తల దించుకుని బాధ పడింది.

కూలీ నాలి పోను
కూసింతైనా చేతికి అందని ఫలాన్ని చూసి
గోరు చుట్టు పైన రోకలిపోటైంది
మన్ను మీదేసుకున్న కష్టానికి
వెన్ను విరిగిన రేటును చూసినాక
ముద్ద నోటి కాడికి రాకుండా పోయింది
సద్దుమనిగిన రైతు బతుకులో
పొద్దు పొడవకుండానే పోయింది.

గింజల్ని విదిలించిన కంకి
పగలబడి నవ్వుతూ వుంటే
ధాన్యరాశి తల దించుకుని కూర్చుంది
గిట్టుబాటు ధర కరువైన పంట
నష్టం ఊబిలో కూరుకుపోతుంటే
రైతు జీవనంలో వెలుగు మాయమైంది
ధాన్యం విలవిలలాడింది.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

రూ. 6,200 కోట్ల కుంభకోణం !

- మనీలాండరింగ్ ఆరోపణలతో యుసిఒ బ్యాంక్ మాజీ సిఎండి అరెస్ట్



న్యూఢిల్లీ : మనీలాండరింగ్ ఆరోపణలతో యుసిఒ బ్యాంక్ మాజీ సిఎండి సుబోధ్ కుమార్ గోయెల్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలిపింది. కోల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి రూ. 6,200 కోట్లకు పైగా బ్యాంకు రుణాలను మళ్లించినట్లు పేర్కొంది. ఈ నెల 16న న్యూఢిల్లీలోని తన నివాసంలో గోయెల్‌ను ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 17న కోల్‌కతాలోని ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం కోర్టులో హాజరుపరచినట్లు, 21వ వరకు కస్టడీకి అప్పగించినట్లు ఫెడరల్ ప్రోబ్ ఏజెన్సీ ఓ ప్రకటనలో తెలిపింది. గోయెల్ సిఎండిగా ఉన్న కాలంలో, కోల్‌కతాకు చెందిన సిఎస్‌పిఎల్ కంపెనీకి రూ.6,210.72 కోట్ల నిధులు మళ్లించినట్లు ఇడి తెలిపింది. దీనికి బదులుగా నగదు, స్థిరాస్తులు, ఖరీదైన వస్తువుల రూపంలో గోయెల్ పొందుకున్నట్లు విచారణలో తేలిందని వెల్లడించింది. సిఎస్‌పిఎల్ ప్రధాన ప్రమోటర్ అయిన సంజయ్ సురేఖను గతేడాది డిసెంబర్‌లో ఇడి అరెస్టు చేసింది.

కన్నీటి వీడ్కోలు

- ముగిసిన చిన్నారుల అంత్యక్రియలు
- శోకసంద్రంలో ద్వారపూడి

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం) : కారులో చిక్కుకొని మరణించిన చిన్నారులకు ద్వారపూడి గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామమంతా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఎవరిని చూసినా, ఎవరు మాట్లాడినా చెమ్మగిల్లిన కళ్లతో, గద్గద స్వరంతో దు:ఖసాగరంలో మునిగి ఉన్నారు. చిన్నారుల తల్లిదండ్రుల ఆవేదన చూపరులను కంటతడి పెట్టించింది. విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలో కారు లాక్ పడి అందులో చిక్కుకుని మృతి చెందిన నలుగురు చిన్నారులకు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. విజయనగరం రూరల్ ఎస్‌ఐ వి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారుల మృత దేహాలకు శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం నాలుగు మృతదేహాలను ద్వారపూడి గ్రామానికి తరలించారు. బంధువులు చూడటానికి కొంత సమయంపాటు ఉంచిన అనంతరం శ్మశానవాటికకు తరలించి నలుగురి భౌతికకాయాలను పక్కపక్కనే గోతులు తీసి, పూడ్చిపెట్టి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ సమయంలో ద్వారపూడి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ద్వారపూడి బిసి కాలనీ యువత డిజె, మందుగుండు సామగ్రిని ఏర్పాటు చేసి, చిన్నారులకు కడసారి వీడ్కోలు పలికారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని పరామర్శించారు.

బాధితులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

నలుగురు చిన్నారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. సోమవారం ద్వారపూడి గ్రామంలో బాధిత కుటుంబాలను సిపిఎం నాయకులు తమ్మినేని, రెడ్డి శంకర్రావు పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ బాధితులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారైనందున వారి బతుకు తెరువుకు భద్రత కల్పించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం పట్టణ నాయకులు బూర్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల విరమణపై అమెరికాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

- పార్లమెంటరీ ప్యానెల్‌కు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ గురించి అమెరికాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని శశిథరూర్ నేతృత్వంలోని విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ ప్యానెల్‌కు కేంద్రం తెలిపింది. ఈ కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదని కూడా స్పష్టం చేసింది. వివిధ పార్టీలకు చెందిన 23 మంది సభ్యులు ఉన్న ప్యానెల్‌తో కేంద్ర ప్రభుత్వం తరపున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఇతర అధికారులు సోమవారం మూడు గంటలపాటు సమావేశమయ్యారు. ప్యానెల్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మిస్రి, అధికారులు సమాధానం ఇచ్చారు. భారత్ - పాకిస్తాన్ కాల్పుల విరమణ ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలుగా ఈ విషయాన్ని ప్రకటించారని వివరణ ఇవ్వాలని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ కోరారు. దీనికి ప్రభుత్వం పై విధంగా సమాధానం ఇచ్చింది. అమెరికా అధికారులతో చర్చలు ఒక సాధారణ ప్రక్రియలో భాగమని చెప్పారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించాలని భారత్ జోక్యం చేసుకోవాలని సమానంగా దీన్ని చూడాలని, ఇతర దేశాలు కూడా భారత్ - పాక్‌పై ఇదే విధంగా స్పందించడం సహజమని అధికారులు వివరించారు. మూడో పక్షం మధ్యవర్తిత్వం ఉండకూడదనే విధానం నుంచి భారత్ తప్పుకోలేదని వివరణ ఇచ్చారు. దాడుల గురించి ముందుగానే పాకిస్తాన్‌కు సమాచారం ఇచ్చారని రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కూడా మిస్రి, అతని బృందం ఖండించింది. మొదటి దాడి తరువాత ఆపరేషన్ సిందూర్ గురించి భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాకిస్తాన్‌తో మాట్లాడారని తెలిపారు. ఇటీవల కాలంలో పాకిస్తాన్ ప్రోత్సాహంతో ఉగ్రవాద కార్యకలాపాలు భారత్‌లో పెరిగాయని మిస్రి ప్యానెల్‌కు వివరించారు. గత ఏడాదిలో 24 ఉగ్రదాడులు జరిగాయని, ఇందులో 24 మంది భద్రతా సిబ్బంది, 30 మందికి పైగా సాధారణ ప్రజలు మరణించారని మిస్రి చెప్పారు. సమావేశం తరువాత థరూర్ విలేకరులతో మాట్లాడుతూ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మిస్రి, అధికారులు సంతృప్తికరంగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న మిస్రికి ప్యానెల్ సంఘీభావం తెలిపినట్లు చెప్పారు. మిస్రికి సంఘీభావంగా ఒక తీర్మానం ప్రవేశపెట్టాలనుకున్నా, వద్దని మిస్రి అభ్యర్థించారని థరూర్ విలేకరులకు తెలిపారు.

Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీతలు : 1) శ్రీ బెల్లంకొండ శశిధర్, తండ్రి : వెంకట సత్యనారాయణ, హెచ్.నెం.6-3, మండపాల సెంటర్, మాచవరం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522435, **2) బెల్లంకొండ శశిధర్, తండ్రి :** వెంకట సత్యనారాయణ, ఫ్లాట్ నెం.5యఫ్4, 5వ అంతస్థు, కాకతీయ టవర్స్ 2, ఆర్.యస్.నెం.657/3, నందిగామ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521185, **3) శ్రీ కనజం మురళీ కృష్ణ, తండ్రి :** కనజం నాంచార రావు, డోరు నెం.3/10, రామాలయం వీధి, పెదపూడి, మొవ్వ మండలం, కృష్ణ, విజయవాడ-521135, **4) శ్రీ కనజం మురళీ కృష్ణ,** డోరు నెం.4-103/1, గోళ్ళపూడి, గంగానమ్మ గుడి వెనుక, విజయవాడ రూరల్, కృష్ణ, విజయవాడ-521135.

విషయం : బ్యాంక్ వారికి శ్రీ బెల్లంకొండ శశిధర్ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎనికేపాడు బ్రాంచ్ నుండి అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారికి బదిలి చేయబడినందున సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.14-12-2018** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.14-03-2019** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6/ 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి **లాంఛనముగా స్వాధీనం** చేసుకోవడమైనది.
ఆస్తిని **లాంఛనముగా స్వాధీనం** చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.
కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖావుంచబడిన స్థిరాస్తి వివరములు దిగువ పేర్కొనబడినవి :
ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, నందిగామ, ఆర్.యస్.నెం.657/3, కాకతీయ టవర్స్ 2, 5వ అంతస్థులో **శ్రీ బెల్లంకొండ శశిధర్‌కు** చెందిన ఫ్లాట్ నెం.5యఫ్4కు సంబంధించి న్యాయసమ్మతంగా తనఖావుంచబడిన యావదాస్తి. **మొత్తం స్థలమునకు హద్దులు : తూర్పు:** ఏలూరి వెంకట దుర్గా ప్రసాద్ మరియు కాసు నరసయ్య యొక్క ఆస్తి, **పడమర:** బజారు, **ఉత్తరం:** చిరుమామిళ్ళ శ్రీనివాసరావు యొక్క ఆస్తి, **దక్షిణం:** రావూరి రవి యొక్క ఆస్తి. **రెసిడెన్షియల్ ఫ్లాట్‌కు హద్దులు : తూర్పు:** శూన్యాకాశము, **దక్షిణం:** శూన్యాకాశము, **ఉత్తరం:** శూన్యాకాశము, **పడమర:** ఉమ్మడి వరండా.
స్థలం : విజయవాడ
తేది : 13-05-2025
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

PUBLIC NOTICE

This is to inform the general public that M/s D&S Associates, a Partnership Firm was constituted under Indian partnership Act, 1932, on 30/05/2015 bearing Firm Registration no 2299 of 2015 with the Registrar of Firms, Ranga Reddy. Since there are no operations for the last several years, and the partnership is an At Will Partnership between Mr. Ponnekanti Dayachari as the Managing Partner and Mr. Agniparthi Sudeep as the other partner, the Managing Partner dissolved the said partnership firm w.e.f 10.04.2025 and has submitted the necessary Forms before the Registrar of Firms. As required by law, we are hereby informing the general public about the dissolution of the Firm by way of public Notice.
As per the terms of the Partnership Agreement, the Managing Partner, Dr. Ponnekanti Dayachari, shall have the first right of refusal to the real assets of the firm, namely the 2800 Sq.Yards parcel of land situated in Becker Compound, Guntur District, Guntur Town Survey No: 84, of Brodipet, Ward No:2, Block No:2, with nearest D.Nos. 5-96-1 and 5-42-78, acquired vide sale deed number 9130/2015 registered with the Joint Sub-Registrar's Office, Guntur R.O., Guntur District. This right has been exercised by Dr. Ponnekanti Dayachari, and the other partner, Mr. Agniparthi Sudeep is only entitled to the cash equivalent of the net assets, proportionate to his capital investment and has no right over the property. As such, any person(s) or entities dealing with Mr. Agniparthi Sudeep with respect to the above-mentioned Property or Firm shall do so at their own risk and costs.

(SD) Dr Ponnekanti Dayachari
Managing Partner
M/s D&S Associates (Dissolved)
Contact Address: Plot no 105, Road no 72 (road no 18 internal) Prashasan Nagar, Jubliee hills, Hyderabad, 500033.

భారత్ ధర్మసత్రం కాదు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ధర్మసత్రం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. శ్రీలంక జాతీయుడు ఆశ్రయం కోసం చేసిన అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం తోసిపుచ్చింది. మేము 140 కోట్లమంది ప్రజలతో ఇబ్బంది పడుతున్నామని, ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వాలా అని జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవితానికి భద్రత, స్వేచ్ఛ), ఆర్టికల్ 19 (ప్రాథమిక హక్కులు, భావప్రకటన స్వేచ్ఛ)ల కింద ఈ అంశాన్ని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. పిటిషనర్‌ను చట్ట ప్రకారం అదుపులోకి తీసుకున్నందున, అతని నిర్బంధం ఆర్టికల్ 21ని ఉల్లంఘించదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. ఆర్టికల్ 19 భారత పౌరులకు మాత్రమే అందుబాటులో ఉందని కోర్టు పేర్కొంది. ఇక్కడ స్థిర పడేందుకు హక్కులేదని కోర్టు పేర్కొంది. ప్రాణానికి ముప్పు ఉంటే మరో దేశానికి వెళ్లాలని పిటిషనర్‌కు సూచించింది. గతంలో శ్రీలంకలో చురుకుగా ఉన్న ఉగ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టిటిఇ)తో సంబంధం ఉందని అనుమానిస్తూ శ్రీలంక జాతీయుడిని 2015లో తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2018లో అతనిని దోషిగా నిర్ధారించి.. పదేళ్ల శిక్ష విధించింది. 2022లో, మద్రాస్ హైకోర్టు అతని శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉండటంతో, వీసాపై భారత్‌కు వచ్చానని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. తన భార్య, పిల్లలు భారత్‌లోనే ఉన్నారని, మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని పేర్కొన్నారు.

పనిఒత్తిడితోనే బెంగళూరు టెకీ ఆత్మహత్య!

బెంగళూరు : వారానికి 70 గంటలు పనిచేయాలంటూ పెట్టుబడిదారులు ఒకవైపు ఉపన్యాసాలిస్తుంటే,, సుదీర్ఘ పనిగంటలు, నిరంతర వేధింపులు, మేనేజర్ల ఒత్తిడి టెక్ ఉద్యోగుల పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. విషపూరిత పనిసంస్కృతి, మేనేజర్ ఒత్తిడి కారణంగానే ఎఐ సంస్థకు చెందిన 25 ఏళ్ల మెషిన్ లెర్నింగ్ (ఎంఐ) ఇంజనీర్ నిఖిల్ సోమవంశీ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది. రెండువారాల క్రితం బెంగళూరులోని అగర సరస్సులో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. సోమవారం అతని మృతిపై స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పని ఒత్తిడి, అమెరికాకు చెందిన మేనేజర్ వేధింపులు తట్టుకోలేక అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల ఎర్నెస్ట్ అండ్ యంగ్‌లో 26 ఏళ్ల ఉద్యోగి అన్నా సెబాస్టియన్ గుండెపోటుతో మరణించారు. ఉద్యోగ ఒత్తిడి, అధిక పనిగంటలు గుండెపోటుకు కారణమని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. తన ఉన్నతాధికారులు, కార్యాలయంలోని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బజాజ్ ఫైనాన్స్‌కి చెందిన 42 ఏళ్ల ఉద్యోగి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు.

స్థానికత అంశం పిటిషన్‌పై వాదనలు

- 2న సుదీర్ఘ వాదనలు వింటామన్న సిజెఐ ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'రాష్ట్రం నుంచి బయటకు వెళ్లి, అవకాశవాద భావనతో తిరిగి వచ్చే వ్యక్తులు ఉన్నారు. తెలంగాణలో పుట్టి దుబాయ్‌కు వెళ్లి, తిరిగొచ్చి రాష్ట్రం నుంచి మెడికల్ సీట్లకు దరఖాస్తు చేసుకుంటున్నారు' అని మెడికల్ సీట్లలో స్థానికత పిటిషన్‌పై తెలంగాణ ప్రభుత్వ తరపున న్యాయవాది సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. మెడికల్ కోర్సు అడ్మిషన్లకు స్థానికతకు సంబంధించి నీట్‌కు ముందు నాలుగేళ్లు స్థానికంగా చదవాలని నిబంధనల చేర్చుతూ... తెలంగాణ ప్రభుత్వం జిఓ 33ను తీసుకొచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్‌తోపాటు మరో 160 మంది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. 'ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం గైడ్ లైన్స్ లేవు. మొదట గైడ్ లైన్స్, రూల్స్ రూపొందించాలి' అని ప్రభుత్వానికి సూచిస్తూ విద్యార్థులకు అనుకూలంగా గతేడాది సెప్టెంబర్ 5న హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సెప్టెంబర్ 11న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ తరువాత మరికొంత మంది విద్యార్థులు తమకు కూడా స్థానికత వర్తింపజేయాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం, కాళోజీ నారాయణరావు వర్సిటీతోపాటు మిగిలిన అన్ని పిటిషన్లపై సోమవారం సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎజి మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. జూన్ 2న సుదీర్ఘ వాదనలు వింటామని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank **శాఖా కార్యాలయం :** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1) మెస్సర్స్ శ్రీ లక్ష్మిఆదిత్య ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహించు పార్టనర్స్: శ్రీ ఉదగండ్ల బాలు & శ్రీ దొడ్డి కిషోర్ కుమార్, రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: డి.నెం.25-2-75/ఎ, అడప వారి వీధి, ఆర్.అగ్రహారం, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522004. ఫ్యాక్టరీ చిరునామా: మెస్సర్స్ శ్రీ లక్ష్మిఆదిత్య ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహించు పార్టనర్స్: శ్రీ ఉదగండ్ల బాలు & శ్రీ దొడ్డి కిషోర్ కుమార్, కేరాఫ్ శ్రీ లక్ష్మీనారాయణ కాటన్ మిల్స్, డోర్ నెం.8-215-5, అనంతవరప్పాడు రోడ్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522017. 2) శ్రీ ఉదగండ్ల బాలు, మెస్సర్స్ శ్రీ లక్ష్మి ఆదిత్య ట్రేడర్స్ పార్టనర్, ఆర్/ఒ ఫ్లాట్ నెం.408, బి బ్లాక్, టెంపుల్ ట్రీ పార్క్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు-520005. 3) శ్రీ దొడ్డి కిషోర్ కుమార్, మెస్సర్స్ శ్రీ లక్ష్మి ఆదిత్య ట్రేడర్స్ పార్టనర్, ఆర్/ఒ ఫ్లాట్ నెం.107, రిషి వల్లే అపార్ట్‌మెంట్, చుట్టుగుంట సర్కిల్ దగ్గర, రుచి గ్రాండ్ ప్రక్కన, గుంటూరు-522003. మరియు: డి.నెం.25-2-75/ఎ, అడపవారి వీధి, ఆర్.అగ్రహారం, గుంటూరు-522004. 4) శ్రీ ఉదగండ్ల బాలు (హామీదారు), ఆర్/ఒ ఫ్లాట్ నెం.408, బి బ్లాక్, టెంపుల్ ట్రీ పార్క్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు-520005. 5) శ్రీ దొడ్డి కిషోర్ కుమార్ (హామీదారు), ఆర్/ఒ ఫ్లాట్ నెం.107, రిషి వల్లే అపార్ట్‌మెంట్, చుట్టుగుంట సర్కిల్ దగ్గర, రుచి గ్రాండ్ ప్రక్కన, గుంటూరు-522003 మరియు: శ్రీ దొడ్డి కిషోర్ కుమార్, డి.నెం.25-2-75/ఎ, అడపవారి వీధి, ఆర్.అగ్రహారం, గుంటూరు-522004. 6) శ్రీ ఎర్రిబోయిన వెంకటేశ్వరరావు (హామీదారు), ఆర్/ఒ డి.నెం.20-18-402/ఎ, డిఎస్ నగర్, 2వ లేన్, ఈత్మూరు రోడ్, గుంటూరు-522003.	ఆస్తి-1: షెడ్యూల్: గుంటూరు జిల్లా, మునుపటి నల్లపాడు సబ్ జిల్లా, వెంగళాయపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం.1206/ఎ లోని ఎ.8.12 సెంట్లు మొత్తం విస్తీర్ణంలో ఎ.1.00 సెంట్లు ప్లాట్లుగా ఏర్పడిన దానిలో ప్లాటు నెం.7, 8, 9 మరియు 10 గా గల 1008 చ.గ.లు విస్తీర్ణం గల స్థలము యావదాస్తి నకు హద్దులు: తూర్పు: 30 అడుగులు వెడల్పు రోడ్డు-144 అ.లు, పడమర: పంది శ్రీనివాసరావు గారికి చెందిన భూమి-144 అ.లు, దక్షిణం: ప్లాటు నెం.6 స్థలము-63 అ.లు, ఉత్తరం: పంది శ్రీనివాస రావు గారికి చెందిన స్థలము-63 అ.లు. ఈ హద్దుల మధ్య 1008 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ స్థలము శ్రీ యెర్రిబోయిన వెంకటేశ్వరరావు గారి పేరున కలదు. ఆస్తి-2: షెడ్యూల్: గుంటూరు జిల్లా, మునుపటి నల్లపాడు సబ్ జిల్లా, వెంగళాయపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం.1206/ఎ లోని ఎ.8.12 సెంట్లు మొత్తం విస్తీర్ణంలో ఎ.1.00 సెంట్లు ప్లాట్లుగా ఏర్పడిన దానిలో ప్లాటు నెం.5 మరియు 6 గా గల 480 చ.గ.లు విస్తీర్ణం గల స్థలము యావదాస్తి నకు హద్దులు: తూర్పు: 33 అడుగులు వెడల్పు మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు-68 అ.లు, పడమర: పంది మమత గారికి చెందిన భూమి-68 అ.లు, దక్షిణం : ప్లాటు నెం.7 స్థలము-72 అ.లు, ఉత్తరం : ప్లాటు నెం.4 స్థలము-72 అ.లు. ఈ హద్దుల మధ్య 480 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ స్థలము శ్రీ ఉదగండ్ల బాలు గారి పేరున కలదు.	తేది.29.08.2024 నాటికి రూ.1,76,17,284.11 (అక్షరాలా ఒక కోటి డెబ్బై ఆరు లక్షల పదిహేడు వేల రెండు వందల ఎనభై నాలుగు రూపాయల పదకొండు పైసలు మాత్రమే) + తేది.30.08.2024 నుండి వర్తించని వడ్డీ + బకాయిలు పూర్తిగా వసూలు అగునంత వరకు ఇతర ఛార్జీలు	05.06.2025 మ॥ 02.00 గం.ల నుండి సా॥ 06.00 గం.ల వరకు	ఆస్తి నెం.1: రిజర్వు ధర : రూ. 61,23,600/- ధరావత్తు : రూ. 6,12,360/- బిడ్ పెంపుదల: రూ. 20,000/- ఆస్తి నెం.2: రిజర్వు ధర : రూ. 31,10,400/- ధరావత్తు : రూ. 3,11,040/- బిడ్ పెంపుదల: రూ. 20,000/-	ఆస్తి నెం.1: భౌతికంగా ఆస్తి నెం.2: భౌతికంగా	తేది.03.06.2025 ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 05.00 గం.ల వరకు (ముందస్తు అనుమతితో మాత్రమే)

మరిన్ని వివరములకు పైన ఇవ్వబడిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయగలరు.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్ సైట్: https://www.bankofbaroda.in/e-auction.htm మరియు ఆన్ లైన్ ఆక్షన్ పోర్టల్ https://Baanknet.com లింక్‌ను చూడగలరు. ఆసక్తి గల బిడ్డర్లు **అధీకృత అధికారి, టెలిఫోన్ నెం. : 0863-2220244, మొబైల్ నెం.: 89775 13906** నందు సంప్రదించగలరు.

తేది: 19.05.2025 ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

హైకోర్టు రిటైర్డ్ జడ్జీలకు 'ఒకే ర్యాంక్...ఒకే పెన్షన్'

- సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : 'వన్ ర్యాంక్...వన్ పెన్షన్' సూత్రం పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులు అందరికీ వర్తిస్తుందని సుప్రీంకోర్టు సోమవారం రూలింగ్ ఇచ్చింది. జిల్లా న్యాయ వ్యవస్థ నుండి నియమితులైనా లేక న్యాయవాదుల నుంచి నియమించబడినా ఈ సూత్రం వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎజీ మసిహ్, కె.వినోద్ చంద్రన్‌తో కూడిన బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులందరికీ ఏడాదికి రూ.13.65 లక్షల కనీస పెన్షన్ లభిస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది.

'పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులకు అందించే ప్రయోజనాల విషయంలో వివక్ష చూపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని అభిప్రాయపడుతున్నాం. హైకోర్టు న్యాయమూర్తులు అందరూ...వారి నియామక తేదీతో సంబంధం లేకుండా పూర్తి పెన్షన్‌కు అర్హులవుతారు' అని సుప్రీంకోర్టు బెంచ్ చెప్పింది. పెన్షన్ ప్రయోజనాలను నిర్ణయించేటప్పుడు న్యాయమూర్తి పాత పెన్షన్ పథకం కింద ఉన్నారా లేక కొత్త పెన్షన్ పథకం కింద ఉన్నారా అనే దానితో సంబంధం ఉండకూడదని తెలిపింది. 'పదవిలో ఉన్నప్పుడు న్యాయమూర్తి చనిపోతే ఆయన కుటుంబ సభ్యులకు అందరికీ గ్రాట్యుటీ అందజేయాలి. ఆయన భార్యకు పెన్షన్ ఇవ్వాలి' అని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ చెప్పారు.

మళ్లీ కరోనా

- సింగపూర్, హాంకాంగ్‌ల్లో భారీగా కేసులు
- దేశంలో 257 నమోదు

న్యూఢిల్లీ : కరోనా మళ్లీ కోరలు చాచుతోంది. కొన్ని వారాలుగా సింగపూర్, హాంకాంగ్‌ల్లో కోవిడ్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. భారత్‌లో సోమవారం నాటికి 257 క్రియాశీల కేసులు ఉన్నాయి. ఈ కేసులన్నీ స్వల్ప తీవ్రతతో కలిగి ఉన్నవని, ఆసుపత్రుల్లో చేరాల్సి అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఇతర దేశాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో దేశంలో పూర్తి అప్రమత్తతో ఉన్నామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి), ఐసిఎంఆర్ ద్వారా కోవిడ్‌తో సహా శ్వాసకోశ వైరల్ వాధ్యుల నిఘా కోసం బలమైన నిఘా వ్యవస్థ దేశంలో ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి), ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ (ఇఎంఆర్), డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్), కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల నిపుణులతో ఇటీవల డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్‌ఎస్) అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం తరువాత కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు.

బలవంతపు మతమార్పిడులను రాజ్యాంగం సమర్థించదు

- అలహాబాద్ హైకోర్ట్ రూలింగ్

ప్రయాగరాజ్ : భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు తన మతాన్ని స్వేచ్ఛగా అనుసరించవచ్చుని, దాని గురించి ప్రచారం చేయవచ్చునని, అది బలవంతపు లేదా మోసపూరిత మతమార్పిడులను సమర్థించదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. చట్టవిరుద్ధ మత మార్పిడుల నిషేధానికి సంబంధించిన ఉత్తరప్రదేశ్ చట్టం కింద నలుగురు వ్యక్తులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా న్యాయమూర్తి వినోద్ దివాకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. నిందితులకు డబ్బు, ఉచిత వైద్య చికిత్సను ఆశ చూపి క్రైస్తవ మతంలోకి మార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును రద్దు చేయడానికి న్యాయస్థానం నిరాకరించింది.

అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్‌కు ప్రొస్టేట్ కేన్సర్!

- త్వరగా కోలుకోవాలంటూ ట్రంప్, ఒబామా, కమలాహారిస్, మోడీ సందేశాలు



వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రమైన ప్రొస్టేట్ కేన్సర్‌తో బాధ పడుతున్నట్లు డెమొక్రటిక్ పార్టీ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఆ కేన్సర్ ఆయన శరీరంలో ఎముకలకు కూడా వ్యాపించిందని తెలిపింది. మూత్రసంబంధిత సమస్యలు తలెత్తడంతో పరీక్షలు చేయించగా, ప్రొస్టేట్ నాడ్యూల్‌ను కనుగొన్నారు. ఆయనకు చికిత్సనందించే విషయమై ప్రస్తుతం వున్న అవకాశాలు, మార్గాలను బైడెన్ కుటుంబం పరిశీలిస్తోందని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విషయం తెలిసిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా, కమలా హారిస్, భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభృతులు స్పందించారు. బైడెన్ త్వరలోనే పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు.

ప్రధాని మోడీ సందేశం

బైడెన్ త్వరలోనే కేన్సర్ నుండి బయటపడాలని, పూర్తి స్థాయిలో కోలుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ప్రజల్లోకి వెళ్లండి

- విద్యార్థి, యువజనులకు భగత్‌సింగ్ ఇచ్చిన సందేశం అదే
- పుచ్చలపల్లి సుందరయ్య 40వ స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ చమన్‌లాల్

భగత్‌సింగ్ ప్రాసంగికత-నేటి రాజకీయాలు' అంశంపై సుందరయ్య 40వ స్మారకోపన్యాసం చేస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ చమన్‌లాల్, వేదికపై బివి రాఘవులు, తెలకపల్లి రవి, ఎస్..వినయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

'విద్యార్థి, యువజనులు ప్రజల్లోకి వెళ్లాలి. పొలాలు, కార్ఖానాల్లోకి వెళ్లి అక్కడి వారి జీవితాల గురించి తెలుసుకోవాలి. సమస్యల పరిష్కారంపై వారిని చైతన్యవంతులను చేయాలి. అప్పుడే విప్లవోద్యమ విజయానికి నాంది పడుతుంది' అని భగత్‌సింగ్ సందేశం ఇచ్చారని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు), పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ చమన్‌లాల్ స్పష్టం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'భగత్‌సింగ్ ప్రాసంగికత-నేటి రాజకీయాలు' అంశంపై జరిగిన సుందరయ్య 40వ స్మారకోపన్యాసంలో ప్రధాన వక్తగా ఆయన మాట్లాడారు. మతోన్మాదంపై వందేళ్ల క్రితం భగత్‌సింగ్ చెప్పిన మాటలను ఇప్పుడు బహిరంగంగా ఎందుకు చెప్పలేకపోతున్నామో ఆలోచించాలని సూచించారు. కరాచీ బేకరిపై దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. భగత్‌సింగ్ ముమ్మాటికీ కమ్యూనిస్టు నాయకుడేనని, ఆయన బతికి ఉంటే గొప్ప అంతర్జాతీయ కమ్యూనిస్టు నేతగా ఎదిగి ఉండేవారని తెలిపారు. ఉరికంబం ఎక్కేముందు కూడా లెనిన్ రాసిన పుస్తకాన్ని చదివి, విప్లవకారులు లెనిన్‌ను చదవాలని సందేశం పంపారని గుర్తు చేశారు. లాటిన్ అమెరికా స్టార్‌గా చెగువేరా ఎదిగినట్టే, దక్షిణాసియా విప్లవతారగా భగత్‌సింగ్ నిలిచారని తెలిపారు. భారతదేశం కులాల కుంపటిగా ఉన్నప్పుడే నవజీవన్ భారత్ సభలో సామూహిక సహఫంక్తి భోజనాలు ఏర్పాటు చేశారని, జైలులో ఉన్నప్పుడు అక్కడి దళిత పారిశుధ్య కార్మికురాలిని 'అమ్మా' అని ఆప్యాయంగా పిలిచి సంభాషించేవారని, ఆయనలోని సమిష్టి భావనకు ఇది ఉదాహరణ మాత్రమేనని వివరించారు. భగత్‌సింగ్ అంటే భారతదేశంలో ఆరాధనాభావం ఉందని, దక్షిణాది రాష్ట్రాల్లో పూలే, పెరియార్, అంబేద్కర్‌తోపాటు భగత్‌సింగ్ చిత్రపటాలను పెట్టడాన్ని గమనించవచ్చని, కులదురహంకారాన్ని పోరాడి దూరం చేసుకోవాలే తప్ప, దేహీ అని యాచించడం సరికాదనేదే ఆయన అభీష్టమని తెలిపారు. విద్యార్థులకు రాజకీయాలు అవసరమేనని, విశ్వవిద్యాలయాలను రాజకీయరహితం చేయరాదని గట్టిగా విశ్వసించేవారని వివరించారు. విప్లవం అంటే దోపిడీ నుంచి విముక్తిని ప్రసాదించే మానవ సమాజ సమూల మార్పు అని సంపూర్ణ విప్లవాత్మక అవగాహన ఉన్న వ్యక్తి భగత్‌సింగ్ అని కీర్తించారు. సిద్ధాంతపరంగా ఎన్ని విభేదాలు ఉన్నా మహాత్మాగాంధీని గౌరవించాలని భగత్‌సింగ్ చెప్పేవారని, గాంధీ తన సందేశాన్ని ప్రజలకు చేరవేసే పద్ధతి గురించి తెలుసుకోవాలని విశ్లేషించేవారని తెలిపారు. నిర్భీతి, నిర్భయత్వం గురించి భగత్‌సింగ్ నుంచి నేర్చుకోవాలన్నారు. బహుభాషాప్రావీణ్యం ఉన్న భగత్‌సింగ్ చిన్న వయసులోనే తన విప్లవ సాహిత్యం ద్వారా యువతరానికి స్ఫూర్తిని ఇచ్చారని, దీన్ని స్వీకరించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళని పేర్కొన్నారు.

శాంతి కావాలని కోరే వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు : బివి రాఘవులు ,

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సుందరయ్య విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు బివి రాఘవులు మాట్లాడుతూ కులవ్యవస్థను ధ్వంసం చేయడాన్ని హక్కుగా లాక్కోవాలని భగత్‌సింగ్ దిశానిర్దేశం చేశారన్నారు. ప్రజలపై నమ్మకంతోనే ఆయన ఉరికంబాన్ని సులభంగా ఎక్కారని తెలిపారు. కమ్యూనిస్టులు శాంతి కోసం యుద్ధం చేస్తారన్నారు. భారతదేశంలో ఉగ్రవాదాన్ని ఓ మతానికి చెందినదిగా చూపుతూ, దాన్ని నేలమట్టం చేస్తామని చెప్పడం అవివేకమని తెలిపారు. శాంతి కావాలని కోరే వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని, యుద్ధాల తర్వాత మళ్లీ శాంతి చర్చలు అంటూ కమ్యూనిస్టుల బాటలోనే నేటి పాలకులు పయనిస్తున్నారని అన్నారు. చమన్‌లాల్ ప్రసంగాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలుగులోకి అనువదించారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి, ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎస్..వినయ్‌కుమార్, పలువురు ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.

భారత్‌కు అమెరికా షాక్

- ఎగుమతైన 15 కంటెయినర్ల మామిడిపండ్లు తిరస్కరణ
- డాక్యుమెంటేషన్‌లో లోపాలను ఎత్తిచూపుతూ నిరాకరణ
- వ్యాపారులకు భారీ నష్టం.. రూ.4 కోట్లకు పైనేనని అంచనా
- చర్చనీయాంశంగా యుఎస్ తీరు

న్యూఢిల్లీ : భారత్‌తో సంబంధాలు, వాణిజ్యం విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలను కలిగిస్తున్నది. ప్రధాని మోడీ స్నేహితుడైన ఆయన.. అమెరికాకు రెండో సారి అధ్యక్షుడు అయినప్పటి నుంచి పలు షాక్‌లు ఇస్తున్నారు. ట్రేడ్ టారిఫ్‌లు, ఇటీవల భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులలో ఆయన వ్యవహరించిన తీరు, కాశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వంపై ప్రతిపాదన తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. అరబ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్.. విదేశీ గడ్డపై మాట్లాడుతూ భారత్‌లో యాపిల్ కంపెనీ కార్యకలాపాలపై అసంతృప్తి వెళ్లగక్కిన తీరు కూడా ఆందోళనను, అనుమానాలను రేకెత్తించింది. తాజాగా, అమెరికాలోని లాస్ ఏంజిల్స్, శాన్ ఫ్రాన్సిస్కో, అట్లాంటాతో సహా వివిధ విమానాశ్రయాలకు భారత్ నుంచి 15 కంటైనర్లలో మామిడి షిప్‌మెంట్లు వెళ్లాయి. డాక్యుమెంటేషన్ లోపాల పేరుతో అమెరికా అధికారులు ఎగుమతైన ఆ మామిడిపండ్లను తిరస్కరించారు. అమెరికా నిర్ణయం మామిడిపండ్ల ఎగుమతిదారులను తీవ్ర షాక్‌కు గురి చేసింది. ఆ మామిడిపండ్లను తిరిగి భారత్‌కు తీసుకొచ్చినా అది తీవ్ర ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పాడైపోయే అవకాశం ఎక్కువే. దీంతో ఎటూ పాలుపోని పరిస్థితిలో ఉన్న చాలా మంది ఎగుమతిదారులు మామిడి సరకును అమెరికాలోనే పడేయ్యాలని నిర్ణయించుకున్నారు. అమెరికా చర్యతో ఐదు లక్షల డాలర్ల (రూ.4.27 కోట్లు) నష్టాన్ని ఎగుమతి దారులు అంచనా వేస్తున్నారు.

వాస్తవానికి ఈనెల 8, 9 తేదీలలో.. అమెరికాకు ఎగుమతి అయ్యే ఈ మామిడి పండ్లు ముంబయిలో ఇర్రేడియేషన్ ప్రక్రియకు వెళ్లాయి. అమెరికాకు ఎగుమతి కావాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి. మామిడిలో తెగుళ్ల తొలగించటానికి, అవి ఎక్కువ కాలం ఉండటానికి పండ్లను నియంత్రిత ఇర్రేడియేషన్‌కు పంపుతారు. ఈ ప్రక్రియ జరిగినప్పటికీ.. అక్కడి అమెరికా అధికారులు మాత్రం డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లను కారణంగా చూపెడుతూ ఎగుమతిని తిరస్కరించారు. ముఖ్యంగా, పీపీక్యూ 203 ఫారంలో తప్పులు దొర్లాయని చెప్పారు. "పీపీక్యూ 203 ఫారం సరిగ్గా జారీ చేయని కారణంగా సరకును తిరస్కరించినట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తెలిపింది. సరకును వెనక్కి పంపటమో, ధ్వంసం చేయటమో చేయాలని చెప్పింది. వెనక్కి పంపేందుకు అయ్యే ఖర్చును అమెరికా ప్రభుత్వం భరించదు" అని అమెరికా వ్యవసాయ విభాగం (యుఎస్‌డిఎ) స్పష్టం చేసినట్టు వ్యాపారులు తెలిపారు. ముంబయిలోని ఇర్రేడియేషన్ కేంద్రంలో యుఎస్‌డిఎ ప్రతినిధి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుందని వారు అన్నారు. "అమెరికాకు మామిడి పండ్ల ఎగుమతికి అవసరమైన పిపిక్యూ203 ఫారమ్‌ను ఆ ప్రతినిధే ధ్రువీకరించాలి. ఇర్రేడియేషన్ కేంద్రంలో జరిగిన పొరపాట్లకు మేము నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది" అని ఎగుమతిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇర్రేడియేషన్‌కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని అమెరికా అధికారులు చెప్పున్నదానిలో వాస్తవం లేదని ఒక వ్యాపారి తెలిపాడు. ప్రక్రియ పూర్తయ్యాకే పిపిక్యూ203 ఫారమ్ ఇచ్చారనీ, యూఎస్‌డీఏ అధికారి జారీ చేసిన ఆ ఫారమ్ లేకుండా ముంబయి ఎయిర్‌పోర్టులో మామిడి పండ్లను విమానంలోకి ఎక్కించటానికి కూడా అనుమతించరని వివరించాడు.

ప్రపంచంలోనే మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉన్నది. అమెరికా.. భారత్‌కు ప్రధాన దిగుమతిదారుగా ఉన్నది. ఇంత పెద్ద మొత్తంలో భారత్ నుంచి ఎగుమతి అయిన మామిడిపండ్లను సరైన డాక్యుమెంటేషన్ లేదనే కారణంతో అమెరికా తిరస్కరించటం చర్చనీయాంశంగా మారింది.

విప్లవ కవితను ఆలపించడమే నేరం

రాజద్రోహం కేసు పెట్టిన నాగపూర్ పోలీసులు

ముంబయి : ఫైజ్ అహ్మద్ ఫైజ్... ఈ రచయిత విప్లవ కవితలకు పెట్టింది పేరు. నిరసన గళం వినిపించాలంటే ఆయన కవితలను విధిగా ఆలపించే వారు. అంతటి స్ఫూర్తిదాయకమైన ఫైజ్ కవితలు ఆలపిస్తే ఇప్పుడు రాజద్రోహం నేరం మోపి వేధిస్తున్నారు. నటుడు, కార్యకర్త అయితే వీర సతిదార్ జ్ఞాపకార్థం గత వారం ముంబయిలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో యువ సాంస్కృతిక బృందం సభ్యులు పేరొందిన ఫైజ్ కవిత 'హమ్ దేఖేంగే'ని ఆలపించారు. దీనిపై నాగపూర్ పోలీసులు నిర్వాహకులు, వక్త పై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 152 (రాజద్రోహం)తో పాటు సెక్షన్ 196 (గ్రూపుల మధ్య శతృత్వాన్ని పెంచడం), సెక్షన్ 353 (ప్రజల దుశ్చర్యకు దోహదపడే ప్రకటనలు చేయడం) కింద కేసు నమోదు చేశారు. ప్రముఖ నటుడు, రచయిత, పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు సతిదార్ కోవిడ్‌తో 2021 ఏప్రిల్ 13న చనిపోయారు. అప్పటి నుంచి ఆయన భార్య పుష్ప ప్రతి ఏటా సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న విదర్భ సాహితీ సంఘ్‌లో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమానికి 150 మందికి పైగా హాజరయ్యారు. బిజెపి నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న వివాదాస్పద మహారాష్ట్ర స్పెషల్ పబ్లిక్ సెక్యూరిటీ బిల్లు గురించి జాగీర్దార్ ప్రసంగించారు. బిల్లు చట్ట రూపం దాలిస్తే మానవ హక్కులకు ప్రమాదం ఏర్పడుతుందని, నిరసన గళం వినిపించే వారిపై అర్బన్ నక్సల్స్ ముద్ర వేయడానికి వీలు కల్పిస్తుందని పలువురు హక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగపూర్‌కు చెందిన దత్తాత్రేయ షిర్కే ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో వ్యక్తుల పేర్లు ఉదహరించనప్పటికీ అవి కార్యక్రమ నిర్వాహకులు, వక్తనే సూచిస్తుంది. 2022 మే 11న సుప్రీంకోర్టు చారిత్రక ఆదేశాన్ని జారీ చేస్తూ రాజద్రోహ చట్టాన్ని పునఃపరిశీలన చేసే వరకూ ఐపిసిలోని 124-ఏ సెక్షన్ కింద పెండింగులో ఉన్న విచారణలు, అప్పీళ్లు, చర్యలను నిలిపివేసింది.

అలీఖాన్ పిటిషన్ విచారణకు అంగీకారం

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రొఫెసర్
- విమర్శకులను చూసి బిజెపి భయపడుతోంది : ప్రతిపక్షాల ఆగ్రహం
- బేషరతుగా విడుదల చేయాలి : ఐద్వా

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌పై తాను సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తనను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ అశోక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అత్యవసర ప్రాతిపదికన అలీ ఖాన్ పిటిషన్‌ను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీం బెంచ్ మంగళ లేదా బుధవారాల్లో ఈ పిటిషన్‌ను విచారించే అవకాశం ఉంది. దేశభక్తి పూరితమైన ప్రకటనలు చేసిన తన క్లయింట్‌ను అరెస్ట్ చేశారని ఆయన తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. దేశద్రోహం ఆరోపణలు మోపుతూ ప్రొఫెసర్ అలీ ఖాన్‌ను అరెస్ట్ చేయడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విమర్శకులను చూసి బిజెపి ఎంత భయపడుతోందో ఈ అరెస్ట్ తేటతెల్లం చేస్తోందని పేర్కొన్నాయి. విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా వంటి వ్యక్తులు స్వేచ్ఛగా సంచరిస్తుంటే, శాంతి కోసం నిలబడే వారిని అరెస్ట్ చేస్తున్నారని సిపిఎం విమర్శించింది. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ఎందుకింత భయం : ఖర్గే

ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్‌ను అరెస్ట్ చేసిన తీరు చూస్తుంటే విమర్శలకు బిజెపి ఎంత భయపడుతోందో అర్థమవుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం వ్యాఖ్యానించారు. 'పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి ముస్లింలు, కాశ్మీరీలపై ద్వేషపూరిత ప్రచారాన్ని ఖండిస్తే ఆమెను దుర్మార్గంగా ట్రోలింగ్ చేశారు. ఆపరేషన్ సిందూర్ సమాచారాన్ని దేశ మీడియాకు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరిగా అభివర్ణిస్తూ మధ్యప్రదేశ్ బిజెపి నేత, మంత్రి కున్వర్ విజయ్ షా అవమానించారు.

సాయుధ దళాలపై అటువంటి అవమానకరమైన ప్రకటనలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రిని తొలగించాల్సింది పోయి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని, దేశ సేవలో వృత్తిపరమైన విధులు నిర్వర్తించే వారిని తమ మనుగడకు ముప్పుగా బిజెపి - ఆర్ఎస్ఎస్ భావిస్తోందని ఖర్గే విమర్శించారు. దేశ ప్రయోజనాల ప్రాధాన్యత దృష్ట్యా సాయుధ దళాలను, ప్రభుత్వాన్ని సమర్థిస్తున్నామంటే సర్కారును ప్రశ్నించలేమని అనుకోవడం పొరబాటని స్పష్టం చేశారు.

విమర్శ కూడా దేశభక్తిపూరితమే : ఆర్‌జెడి

ప్రభుత్వాన్ని విమర్శించడం అంటే దేశాన్ని విమర్శించడం కాదని ఆర్‌జెడి ఎంపీ మనోజ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను, ప్రభుత్వ నాయకులను విమర్శించడం కూడా దేశభక్తి పూరిత చర్యలేనన్నారు. దేశాన్ని అభివృద్ధి దిశగా సాగేలా చూసేందుకు, దాని విలువలను నిలబెట్టాలనే ఉద్దేశంతోనే విమర్శలు, వ్యాఖ్యలు చేస్తారని అన్నారు. విద్వేష వ్యాఖ్యలు చేసిన విజయ్ షా వంటి వ్యక్తులు సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతుంటే న్యాయం కోసం, శాంతి కోసం పిలుపునిచ్చే వారిని లక్ష్యంగా చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఖండన

మేధావులను, సామాజిక కార్యకర్తలను ముఖ్యంగా ఒక మతానికి చెందిన వారిని బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందనడానికి ఇది మరొక ఉదాహరణ అని ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు విమర్శించాయి. అలీఖాన్ విషయంలో స్పందించిన హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ ఆ రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాల విషయంలో మౌనంగా వుందని విమర్శించాయి. తక్షణమే మహ్మూదాబాద్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. ఆయనపై గల ఎఫ్ఐఆర్‌ను, కమిషన్ జారీ చేసిన సమన్లును ఉపసంహరించాలని కోరాయి.

విద్యావేత్తల ఖండన

ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేశారని, ప్రస్తుతం ఆయనను హర్యానాలోని రాయ్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారని విద్యార్థి పత్రిక 'ది ఎడిక్ట్' తెలియజేసింది. అలీఖాన్ అరెస్టుపై విద్యావేత్తలు, పౌర హక్కుల కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దీనిని భావ ప్రకటనా స్వేచ్ఛ అణచివేతగా అభివర్ణించారు.

సుప్రీం కోర్టులో టెల్కోలకు ఎదురు దెబ్బ!

న్యూఢిల్లీ : సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఎజిఆర్) బకాయిల చెల్లింపుల నుండి తమకు ఉపశమనం కల్పించాలని కోరుతూ టెలికం కంపెనీలు భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, టాటా టెలీ సర్వీసెస్‌లు వేసిన పిటిషన్లను విచారణకు చేపట్టిన సుప్రీం కోర్టు వాటిని తిరస్కరించింది. ఆ పిటిషన్లను తప్పుడు ఉద్దేశంతో దాఖలు చేసినవిగా పరిగణిస్తున్నట్లు జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. తమ బకాయిలు, పెనాల్టీలు, ఆ పెనాల్టీలపై వడ్డీలు ఈ మొత్తం చెల్లింపుల నుండి తమకు ఉపశమనం కావాలని టెల్కోలు భావిస్తున్నాయి. గత అనేక సంవత్సరాలుగా ఎజిఆర్‌పై వరుసగా కోర్టులు ఇచ్చే ఆదేశాల కారణంగా తమకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు వాటిల్లుతున్నాయని, అందువల్ల తాము చెల్లించలేమంటూ ఆ కంపెనీలు తమ పిటిషన్లలో కోరాయి. ఎజిఆర్‌కు సంబంధించి మొత్తంగా రూ.40వేల కోట్లకు పైగా మొత్తాలు వున్నాయి. వీటిని రద్దు చేయాలని కంపెనీలు కోరుతున్నాయి. వినియోగదారులపై ఎడాపెడా ఛార్జీల భారం వేస్తూ... ప్రభుత్వానికి బకాయిలు ఎగ్గొట్టేందుకు కేంద్రంలోని పాలకుల మద్దతుతో టెల్కోలు ప్రయత్నిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

ఖాన్ యూనిస్‌ను ఖాళీ చేయండి

- ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశాలు
- గాజాలోకి ప్రాథమిక సాయానికి అనుమతి

గాజా, జెరూసలేం : ఇజ్రాయిల్ దారుణాలకు హద్దు లేకుండా పోతోంది. గాజాలో రెండవ అతిపెద్ద నగరమైన ఖాన్ యూనిస్‌ను, ఆ చుట్టపక్కల పట్టణాలను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సైనిక ప్రతినిధి అవిచాయ్ అదారీ సోమవారం సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలను విస్తరిస్తోందని, అందులో భాగంగా ఇక ఈ ప్రాంతమంతా ప్రమాదకరమైన యుద్ధ జోన్‌గా పరిగణించబడుతుందని ఆ పోస్టులో పేర్కొన్నారు. కొత్త ఆపరేషన్లతో ఇజ్రాయిల్ తన యుద్ధాన్ని మరింత ఉధృతం చేస్తున్న నేపథ్యంలో తాజా ఆదేశాలు వెలువడ్డాయి. ఇప్పటికే వేలాదిమంది రిజర్వ్ సైనికులను పిలిపించిన ఇజ్రాయిల్ మిలటరీ గాజా ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో పదాతి దళ దాడులను మరింతగా విస్తరించాలని భావిస్తోంది.

మరోవైపు గాజాలోకి ప్రాథమికంగా మానవతా సాయాన్ని పంపేందుకు ఇజ్రాయిల్ అంగీకరించింది. గాజాలో నెలకొన్న ఆహార సంక్షోభం కారణంగా తమకొత్త మిలటరీ ఆపరేషన్ స్తంభించిపోతోందని అందుకే తాము ప్రాథమిక స్థాయిలోనే ఆహార సాయాన్ని గాజాలోకి అనుమతించాలని భావిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. ఈమేరకు తమ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. దాదాపు మూడు మాసాలుగా గాజాలోకి ఎలాంటి సాయాన్ని వెళ్లనివ్వకుండా ఇజ్రాయిల్ ఆంక్షలు విధించింది. దీంతో పెద్ద సంఖ్యలో మందులు, ఆహారం, ఇతర నిత్యావసరాలను తీసుకువచ్చిన ట్రక్కులు గాజా వెలుపలే నిలిచిపోయాయి. ఎప్పుడు ఆహార సాయం గాజాలోకి ప్రవేశిస్తుందో స్పష్టమైన సమాచారం లేదు. గాజాలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఇప్పటికే అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

డజన్ల సంఖ్యలో చిన్నారులు మృతి

గాజాపై సోమవారం ఉదయం నుండి మొదలైన దాడుల్లో గంట వ్యవధిలో ఒక ప్రాంతంలో 30 వైమానిక దాడులు జరిగాయని, 60మందికి పైగా మరణించారని, వీరిలో డజన్ల సంఖ్యలో చిన్నారులు వున్నారని వైద్య వర్గాలు తెలిపాయి. చివరిసారిగా కాల్పుల విరమణ ఉల్లంఘన చేసి దాడులు ఉధృతం చేసినప్పటి నుండి ఇప్పటివరకు 3వేల మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

'ఉక్కు' ప్రైవేటీకరణ కుట్రలు సాగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తిని తగ్గించకుండా, ప్లాంట్‌ను రక్షించుకోవాలని ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం వేధింపులు ఆపడం లేదని, అందుకే కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారని తెలిపారు. సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా విశాఖ ఉక్కులో కార్మికులు ఉత్పత్తిని ఆపకుండా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని, అవసరమైతే ఉత్పత్తిని ఆపైనా నిరవధిక సమ్మెను కొనసాగించడానికి వెనుకాడరని తెలిపారు. ఎనిమిది నెలలుగా 25 శాతం జీతాలనే కార్మికులకు యాజమాన్యం ఇస్తోందని, దీనిపై టిడిపి కూటమి పార్టీల నాయకులు కనీసం మాట్లాడటం లేదన్నారు.

పోలీసుల యత్నాన్ని తిప్పికొట్టిన కార్మికులు

సోమవారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ స్మృత్యంజలి కూడలి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సభ జరిగింది. ఈ సభకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించాచు. అయితే, కార్మికులు ఐక్యంగా ఈ ప్రయత్నాలను తిప్పికొట్టారు. తపన్ సేన్‌తో సహా పలువురు కార్మిక నేతలు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ నుంచే కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈ సభలో ఐఎన్‌టియుసి జాతీయ కార్యవర్గ సభ్యులు మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సిఐటియు నాయకులు వైటి.దాస్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతి రెడ్డి, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు నమ్మి రమణ మాట్లాడారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

జై శంకర్ మౌనం సహించరానిది!

(మొదటి పేజీ తరువాయి)

వీడియో ఒకటి షేర్ చేశారు. పాక్‌లో, పిఓకెలో ఉగ్ర స్థావరాలపై మిలటరీ దాడులకు ముందుగానే పాకిస్తాన్‌కు భారత్ సమాచారం ఇచ్చిందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఇలా తెలియజేయడం నేరమని, భారత ప్రభుత్వం తెలియజేసిందని విదేశాంగ మంత్రే బహిరంగంగా అంగీకరించారని తెలిపారు. ఎవరు అందుకు అధికారమిచ్చారు? ఫలితంగా మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? అని రాహుల్ ప్రశ్నించారు. వాస్తవాలను పూర్తిగా తప్పుదారిపట్టించేలా విమర్శలు చేస్తున్నారని విదేశాంగ శాఖ పబ్లిసిటీ విభాగం వ్యాఖ్యానించింది.

జాతి యావత్తూ సిగ్గుపడుతోంది

(మొదటి పేజీ తరువాయి)

నీచమైన, హేయమైన వ్యాఖ్యలకు మీరు ఇప్పటివరకు ఎందుకు క్షమాపణ చెప్పలేదు." అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. సాయుధ బలగాల మనోభావాలకు సంబంధించిన అంశమైనందున మంత్రి వివేచనతో వ్యవహరించాల్సిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుతానికి మంత్రి అరెస్టుపై స్టే విధించింది. దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరించాల్సిందిగా షాను కోర్టు ఆదేశించింది. అయితే, ఆయన చేసిన వ్యాఖ్యలకు గానూ పర్యవసానాలను ఎదుర్కొనాల్సిందేనని స్పష్టం చేసింది. మంత్రిపై చర్యలు తీసుకుంటామని చెబుతూ, మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. "మేం ఈ పరిణామాలను నిశితంగా పరిశీలించాల్సి వుంది.

ఇది మీకు ఒక పరీక్ష' అని కోర్టు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. వెంటనే మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో లేదా అరెస్టు చేయడంలో ప్రభుత్వ చొరవ కొరవడడాన్ని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం మౌనంగా వూరుకోవడంతో హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించింది. ఈ రోజు వరకు మీరు చేసిందేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ మంత్రి విజయ్ షా, ఉగ్రవాదుల సోదరి అంటూ కల్నల్ సోఫియాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. దీంతో ఈవిషయాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు అమర్యాదపూర్వకమైన భాషను ఉపయోగించినందుకు షాపై తక్షణమే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని ఆదేశించింది.

ప్రమాదంలో 'సమాఖ్య'స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతను ప్రజలే తీసుకోవాలని పిలుపునిచ్చారు. పి మధు మాట్లాడుతూ.. రాష్ట్రాల హక్కులపై పెద్దయెత్తున దాడి జరుగుతోందన్నారు. రాజ్యాంగం మౌలిక స్వభావంలో మార్పులు చేయాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. ఫెడరల్ వ్యవస్థకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చాలా ప్రమాదం తీసుకొస్తుందన్నారు. ఈ వ్యవస్థ నిలబడితేనే దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం ఉంటుందన్నారు. దీనిని దెబ్బతీసే ప్రయత్నం బిజెపి చేస్తోందని, దీనిని ఎదుర్కోవాలని కోరారు. రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని రాష్ట్రపతి ప్రశ్నించే పరిస్థితి వచ్చిందన్నారు. రాజ్యాంగ మౌలిక స్వభావం మార్చే హక్కు పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఎంబివికె ఇన్‌ఛార్జి తులసీరావు సభకు ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమంలో ముందుగా సుందరయ్య చిత్రపటానికి శ్రీధర్, మధుతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంబివికె బాధ్యులు పి రామరాజు.. శ్రీధర్ గురించి వివరించగా టి క్రాంతి కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు.



పుస్తకం చదువుదాం

విశ్రాంత ఉపాధ్యాయుడు గరిపల్లి అశోక్ మాస్టారు గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. బాల సాహిత్యలోకానికి ఆయన సుపరిచితులే. పిల్లలతో తనకున్న అనుబంధం, పిల్లలు చేసిన అల్లరి అనుభవ పాఠాలతో తాజాగా ఆయన రచించిన 'గోళీలాట' పుస్తకం చదువుతుంటే బాల్యం జ్ఞాపకాలు మనసుని తాకుతాయి అనడంలో సందేహం లేదు.

11 కథల సంపుటిగా వచ్చిన ఈ పుస్తకంలో 'బఠాణీలు' కథలో ఒంటరిగా ఉన్నప్పుడు ఒకరే తినాలి. స్నేహితులతో ఉన్నప్పుడు, అందరితో కలిసి తినాలి అంటూ ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకునే ధోరణిని చక్కగా వివరించారు.

మరో కథ 'పిప్పరమెంటు'. ఈ కథలో ఒకటే చాక్లెట్‌ను ఇద్దరూ తీసుకోవాలని టీచర్ చెప్పినప్పుడు 'కాకి ఎంగిలి' చేసి ఒకే చాక్లెట్ పంచుకోవడం విద్యార్థులకు పరస్పర సహకార భావం పెంపొందించేలా కథను చెప్పటం అభినందనీయం. పుస్తకాల్లో ఉన్నది మాత్రమే చదువు కాదని, అంతకు మించి బతుకు పాఠాలు మరెన్నో ఉంటాయని 'ఎండ్రికాయలుబిచేప' కథలో తెలుసుకుంటాం. ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య చక్కటి అనుబంధాన్ని తెలిపే మరో కథ 'మక్క కంకులు'.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కథ ఆణిముత్యమే. అందుకే 'గోళీలాట' కథల సంపుటి తప్పక చదవాల్సిందే. ఈ పుస్తకం ధర 80 రూపాయలు. ముఖచిత్రం ఆందంగా ఆకర్షణీయంగా పిల్లల ఆట పాటలతో తీర్చిదిద్దారు. పుస్తకంలోని మొత్తం పేజీల సంఖ్య 52.

పుస్తక ప్రతులకు : గరిపల్లి సరోజన, వి ఎల్ ఆర్ రెసిడెన్సీ, సిద్ధిపేట

పుస్తక సమీక్షకులు :
- యాడవరం రేవంత్ గౌడ్, ఇంటర్ మొదటి సంవత్సరం, సిద్ధిపేట, 94417 62105.

చాలా విషయాలు నేర్చుకున్నాం

హాయ్ ఫ్రెండ్స్,



మాది రాజమహేంద్రవరం టౌన్ మున్సిపల్ స్కూల్. ఈ ఏడాది వేసవి సెలవుల్లో మా స్కూల్లో జన విజ్ఞాన వేదిక వారు ఏప్రిల్ 29 నుండి మే 15 వరకు సమ్మర్ క్లాసులు నిర్వహించారు. ప్రతి రోజూ ఈ క్లాసులకు 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. మేము ప్రతి సంవత్సరమూ బంధువుల ఇంటికి వెళుతుంటాం. ఈ సారి ఈ క్లాసుల్లో పాల్గొన్నాం. ఇందులో చెప్పిన ఒరిగామి, స్పోకెన్ ఇంగ్లీషు, ఫన్ మాథ్స్, చెస్‌తో పాటు సైన్స్ ప్రయోగాలు మాకు బాగా నచ్చాయి. కొత్త స్నేహితులు లభించారు. ముఖ్యంగా మేజిక్ షో భలే ఆకట్టుకుంది. ఇంతకుముందు ఇంగ్లీషు గ్రామరును అర్థం చేసుకోవటంలో కొంత ఇబ్బంది ఉండేది. ఇక్కడి టీచర్లు చాలా చక్కగా సులభమైన పద్ధతిలో నేర్పించారు. అదే విధంగా సింగింగ్ క్లాసులు, జానపద నృత్యాలు, జాతీయ నాయకుల జీవిత విశేషాలను చాలా తెలుసుకున్నాం. విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించిన ఈ సమ్మర్ క్లాసులకు, ప్రతి ఏడాది రావాలని మా ఫ్రెండ్స్ అందరమూ అనుకున్నాం.

- వి.వి. లలితా పావని, పి. సుబ్రహ్మణ్యం, 10వ తరగతి, టౌన్ మున్సిపల్ హైస్కూలు, రాజమహేంద్రవరం.

బొమ్మల కొలువు

నీలం అస్మిత, 9వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్, నంద్యాల.

ఎం.లోహిత, 9వ తరగతి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, రాజు పేట, అనకాపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA జీవన the family

జీవన సౌరభం

దృఢ సంకల్పం, తరగని ఆత్మవిశ్వాసం, బలమైన కోరిక ఉన్నచోట విజయం తప్పక వచ్చి తీరుతుంది.

ఈ అలవాటును తప్పించండి..

చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి.

చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్ల నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.

వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్ల చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి.. వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

సెగగడ్డలు బాధిస్తున్నాయా..

ఈ కాలంలో శరీరంలో అధిక వేడి కారణంగా ఎక్కడపడితే అక్కడ సెగగడ్డలు వస్తుంటాయి. అవి వచ్చినప్పుడు తీవ్రమైన నొప్పి, బాధ ఉంటుంది. చాలా మంది ఈ బాధను తట్టుకోలేరు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే వీటి నుండి ఉపశమనం పొందాలంటే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి.

- సెగగడ్డలు రాకుండా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పండ్లను రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా చేయటం వల్ల బాక్టీరియా తగ్గుతుంది.

- రోజుకు 3 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి. కొబ్బరి నీళ్లు, జ్యూసులు, కూరగాయల రసాలను సేవించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయటం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్ళి పోతాయి. రక్తం శుద్ధి జరుగుతుంది. తద్వారా సెగగడ్డలు రాకుండా చూసుకోవచ్చు.
- తొక్క తీసిన నాలుగు వెల్లుల్లి రెబ్బలు, అరస్పూన్ వాము కలిపి మెత్తని పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ని సెగగడ్డలు ఉన్న ప్రదేశంలో రాసి పది నిమిషాలు అయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- ఒక గిన్నెలో రెండు స్పూన్ల బియ్యంపిండి వేసి దానిలో నీటిని కలిపి పొయ్యి మీద పెట్టి ఉడికించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సెగ గడ్డలపై రాయాలి. పూర్తిగా ఆరనివ్వాలి అనంతరం చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- కలబంద జెల్‌లో కొద్దిగా పసుపు కలిపి. గడ్డలపై అప్లై చేయాలి. ఆరిన తర్వాత చల్లని వాటర్‌తో శుభ్ర పరుచుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

జ్యూస్‌లో ఐస్ వాడుతున్నారా!

ఎండాకాలం పిల్లలూ, పెద్దలూ చల్లచల్లని జ్యూస్‌లు తాగేందుకు బాగా ఇష్టపడతారు. ఇంట్లో తయారు చేసుకునే పండ్లు, కూరగాయల జ్యూస్‌లైతే ఫరవాలేదు. అదే బయట తయారు చేసే జ్యూస్‌లు ఎక్కువగా తాగుతుంటే మాత్రం కాస్త జాగ్రత్త వహించాలి. బయట తాగే జ్యూస్‌ల్లో వాడే ఐస్ ఆరోగ్యానికి చేటు చేస్తుంది. దీనికి సంబంధించి పూణేకు చెందిన డాక్టర్ రెబెక్కా పింటో సోషల్‌మీడియాలో ఒక వీడియోను షేర్ చేశారు.

రెబెక్కా పింటో తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్కువ మోతాదులో తయారు చేసే ఐస్ ఆరోగ్యానికి హానికరం. అందులో హానికరమైన బ్యాక్టీరియా, వ్యాధికారకాలు,

కాలుష్య కారకాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఐస్ తయారీకి వాడే నీళ్లని అస్సలు ఫిల్టర్ చేయరు. అందులో చాలా బ్యాక్టీరియా కలిసిపోతుంది. ఇవి జీర్ణాశయాంతర వ్యాధులకు కారణమవుతాయి. అందుకే బయట జూస్‌లు తాగేటప్పుడు ఐస్ వేసుకోకపోవడమే మంచిది.

సూర్య కొత్త సినిమా ప్రారంభం



విభిన్న చిత్రాలు, పాత్రలతో వివిధ భాషల ప్రేక్షకులకు తమిళ కథానాయకుడు సూర్య చేరువయ్యారు. తెలుగులోనూ ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ద్విభాషా చిత్రం కోసం ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరితో సూర్య చేతులు కలిపారు. ఇది సూర్య నటిస్తున్న 46వ చిత్రం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.33గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. 'ప్రేమలు' చిత్రంతో యువతకు చేరువైన మమిత బైజు ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో రవీనా టాండన్ తెలుగు సినిమాల్లోకి పునఃప్రవేశం చేస్తున్నారు. సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. నిమిష్ రవి ఛాయాగ్రహణం. ఎడిటర్‌గా నవీన్‌నూలి, కళా దర్శకుడిగా బంగ్లాన్ వ్యవహరిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. భారీ అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందించడానికి చిత్ర బందం సన్నాహాలు చేస్తోంది.

అజయ్ భూపతితో కృష్ణ వారసుడు

కృష్ణ ఫ్యామిలీ నుంచి ఇప్పుడు మరో హీరో రాబోతున్నాడు. కృష్ణ పెద్ద కుమారుడు, రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా తెలుగు తెరకు పరిచయం కాబోతున్నారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో జయకృష్ణకు సంబంధించిన ఓ ఫొటో షూట్ వైరల్ అయింది. తాజాగా సోమవారం జయకృష్ణ మొదటి సినిమా గురించి స్పష్టత వచ్చింది. 'ఆర్‌ఎక్స్ 100', 'మంగళవారం' లాంటి సినిమాలు తెరకెక్కించిన అజయ్ భూపతి, జయకృష్ణ ఎంట్రీ సినిమాకి దర్శకత్వం వహించబోతున్నారు. వైజయంతీ మూవీస్, ఆనంది ఆర్ట్స్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మించనున్నాయి. త్వరలో ఈ సినిమా ప్రకటన రానుంది.

కట్టుబట్టలతో రోడ్డున పడేశారు. : మంచు మనోజ్

'కట్టుబట్టలతో రోడ్డు మీద పెట్టారు. నా పిల్లల దుస్తులు, చిన్నప్పటి నుంచి దాచుకున్న వాటితో సహా ఏదీ వదలకుండా రోడ్డున పడేశారు. మేము బయటకు కూడా వెళ్లటానికి కార్లు కూడా లేకుండా చేశారు. కానీ ఫ్యాన్స్ నన్ను బాగా చూసుకుంటున్నారు. ఇంటి బయట 20 కార్లు నా కోసం పెట్టారు. ప్రతిఒక్కరూ మేమున్నాం అంటూ నా కోసం నిలబడ్డారు. కానీ నాకొక్కటే బాధ. ఇంత చేసినా.. ఇంత జరిగినా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. నాపై ఎన్ని కేసులు వేసినా.. నాకు ఎవరి మీద కోపం రావట్లేదు.. బాధగా మాత్రమే ఉంది. అది నా బలహీనతో.. వాళ్ల బలమో నాకు అర్థం కావట్లేదు' అని టాలీవుడ్ కథానాయకుడు మంచు మనోజ్ అన్నారు. మంచు మనోజ్ చాలా రోజుల తర్వాత 'భైరవం' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈనెల 30వ తేదీన విడుదల కానున్న ఈ చిత్రంలో నారా రోహిత్, బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు 'నాంది' ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వం వహించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు హాజరైన మంచు మనోజ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన కుటుంబ సభ్యులు వ్యవహరించిన తీరును తలచుకుని బాధపడ్డారు.

చైల్డ్ ఆర్టిస్ట్ భరత్ తల్లి కన్నుమూత

టాలీవుడ్ నటుడు, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి కమలహాసిని ఆదివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు, సన్నిహితులు భరత్‌కి ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్.. ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

స్థాయి వచ్చాక సాయం కాదు..

ఆర్ముగ కుమార్ దర్శకత్వంలో విజయ్‌సేతుపతి నటిస్తున్న తాజా ప్రాజెక్టు 'ఏస్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. తన కెరీర్ తొలి రోజుల్ని గుర్తుచేసుకున్నారు. 'కెరీర్ ప్రారంభంలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 'వర్ణం' అనే సినిమాకు ఆడిషన్‌కు వెళ్లాను. అక్కడికి వెళ్లాక సీన్ చెప్పి డైలాగులు కూడా నన్నే రాసుకొని నటించమన్నారు. అప్పుడే నేను డైలాగులు కూడా రాయగలనని తెలుసుకున్నా. ఆర్ముగ కుమార్ ఆ టీమ్‌కు నా పేరు సజెస్ట్ చేశారు. అలా ఆ సినిమాలో అవకాశం వచ్చింది.

అలాగే '96'లో నేను నటించడానికి కూడా ఆయనే కారణం. 'ఒకసారి ఈ సినిమాకు విజయ్ సేతుపతి ఆడిషన్ తీసుకోండి. పాత్రకు సరిపోడు అనుకుంటే తిరస్కరించండి' అని ఆర్ముగ కుమార్ '96' టీమ్‌కు చెప్పారు. మనం అంటూ ఒక స్థాయి వచ్చాక ఎవరైనా సహాయం చేయడానికి ముందుంటారు. కానీ మనం ఎవరో తెలియనప్పుడు కూడా సహాయం చేయడం గొప్ప. ఆ సాయం చీకటితో నిండిన ఇంట్లో దీపం వెలిగించడం లాంటిది. అలా నా జీవితంలో ఆ దీపాన్ని వెలిగించిన మనిషి ఆర్ముగ కుమార్. అతడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విజయ్ సేతుపతి అన్నారు.

సన్‌రైజర్స్ మురిసింది

- **లక్నోపై ఆరు వికెట్లతో ఘన విజయం**

లక్నో : సన్‌రైజర్స్ హైదరాబాద్ మురిసింది. ఐపీఎల్18లో నాల్గో విజయం నమోదు చేసిన ఆరెంజ్ ఆర్మీ సీజన్‌ను మెరుగ్గా ముగించేందుకు సిద్ధమవుతోంది. సోమవారం లక్నోలో లక్నో సూపర్‌జెయింట్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. సన్‌రైజర్స్ చేతిలో ఓటమితో ప్లే ఆఫ్స్ రేసు నుంచి లక్నో సూపర్‌జెయింట్ నిష్క్రమించింది. 206 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ అలవోకగా ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (59, 20 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సులు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. పవర్‌ప్లేలో లక్నో బౌలర్లను ఉతికారేసిన అభిషేక్ శర్మ సన్‌రైజర్స్‌ను గెలుపు దిశగా నడిపించాడు. ఇషాన్ కిషన్ (35), హెన్రిచ్ క్లాసెన్ (47, 28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), కామిందు మెండిస్ (32, 21 బంతుల్లో 2 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నారు. అనికెత్ వర్మ (5 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి (5 నాటౌట్) లాంఛనం ముగించారు. మరో 10 బంతులు ఉండగానే సన్‌రైజర్స్ 206/4 పరుగులు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన 205 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూపర్‌జెయింట్స్ ఓపెనర్లు మిచెల్ మార్ష్ (65, 39 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఎడెన్ మార్‌క్రామ్ (61, 38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. తొలి వికెట్‌కు 10.3 ఓవర్లలోనే 115 పరుగులు జోడించిన ఓపెనర్లు భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. మిడిల్ ఆర్డర్‌లో నికోలస్ పూరన్ (45, 26 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఎవరూ రాణించలేదు. కెప్టెన్ రిషబ్ పంత్ (7) వైఫల్యం కొనసాగగా.. ఆయుశ్ బదాని (3), అబ్దుల్ సమద్ (3), శార్దుల్ ఠాకూర్ (4) నిరాశపరిచారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఈషన్ మలింగ (2/28) రెండు వికెట్లతో మెరువగా.. హర్ష్ దూబె (1/44), హర్షల్ పటేల్ (1/49), నితీశ్ కుమార్ రెడ్డి (1/28) రాణించారు.

ప్లే ఆఫ్స్ రేసు నుంచి లఖ్‌నవూ ఔట్

ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే తప్పకుండా గెలవాల్సిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పరాజయం పాలైంది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించింది.

సింధు, ప్రణయ్ మెరిసేనా?

- **నేటి నుంచి మలేషియా మాస్టర్స్ 2025**

కౌలాలంపూర్ (మలేషియా) : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు ఇటీవల పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతోంది. స్థాయికి తగ్గ ప్రదర్శన చేయటంలో నిలకడగా విఫలం అవుతున్న పి.వి సింధు నేటి నుంచి ఆరంభం కానున్న మలేషియా ఓపెన్‌లో బరిలోకి దిగుతోంది. పురుషుల సింగిల్స్‌లో సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ సైతం ఇటీవల దారుణంగా ఆడుతున్నాడు. ఇటు పి.వి సింధు.. అటు హెచ్.ఎస్ ప్రణయ్ సుదిర్మన్ కప్‌లో ఆడిన రెండు మ్యాచుల్లోనూ పరాజయం పాలయ్యారు. సుదిర్మన్ కప్ తర్వాత విశ్రాంతి తీసుకున్న సింధు, ప్రణయ్ నేటి నుంచి ఆరంభం కానున్న మలేషియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో బరిలోకి దిగుతున్నారు. వరుస వైఫల్యాల నుంచి బయటపడేందుకు మలేషియా ఓపెన్‌లో సింధు, ప్రణయ్ పట్టుదలగా ఆడేందుకు ఎదురుచూస్తున్నారు. మహిళల సింగిల్స్‌లో పి.వి సింధుతో పాటు మాళవిక బాన్సోద్, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడాలు అదృష్టం పరీక్షించుకోనున్నారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్‌తో పాటు సతీశ్ కరుణాకరన్, ఆయుష్ శెట్టి, ప్రియాన్షు రజావత్‌లు బరిలో నిలిచారు. ఇటీవల తైపీ ఓపెన్‌లో సెమీఫైనల్స్‌కు చేరుకున్న ఆయుష్ శెట్టి మలేషియా ఓపెన్‌లోనూ అదే జోరు కొనసాగించాలని చూస్తున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో వరల్డ్ నం.19 జోడీ ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు తొలి రౌండ్లో క్వాలిఫయర్‌తో పోటీపడనుండగా.. రోహన్ కపూర్, రుత్విక గద్దె ఆడనున్నారు. మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం, సిమ్రన్ సింగ్వి.. వైష్ణవి, అలీశా ఖాన్ సహా ప్రేరణ, దేశ్‌పాండేలు ప్రధాన టోర్నీలో ఆడనున్నారు. నేడు జరిగే అర్హత పోటీల్లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్, శంకర్ ముతుస్వామి, తరుణ్ మానెపల్లి, అన్మోల్, తస్నీమ్ మిర్‌లు సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నారు.

ఆ వార్తల్లో నిజం లేదు

- **ఆసియా కప్‌పై బోర్డులో చర్చ జరగలేదు**
- **బిసిసిఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా**

ముంబయి : ఆసియా కప్ నుంచి భారత్ వైదొలిగిందని వస్తున్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పష్టత ఇచ్చారు. 2025 మహిళల, పురుషుల ఆసియా కప్ ఆతిథ్య హక్కులు బీసీసీఐ సొంతం. వచ్చే నెలలో శ్రీలంక వేదికగా జరుగనున్న మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌కు భారత్ దూరమైందని, ఇదే విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు బీసీసీఐ తెలియజేసిందని వార్త కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై స్పందించిన బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా వివరణ ఇచ్చారు. 'ఆసియా కప్ నుంచి భారత్ వైదొలగటం అవాస్తవం. ఆ వార్తలో ఎటువంటి నిజం లేదు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ టోర్నమెంట్లపై బీసీసీఐలో ఎటువంటి చర్చ జరుగలేదు. బీసీసీఐ ప్రస్తుతం ఐపీఎల్18, ఇంగ్లాండ్ సిరీస్‌పై దృష్టి సారించింది. ఆసియా కప్‌పై బీసీసీఐ ఆలోచన చేసి, చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటే ఆ విషయాన్ని మీడియాకు తెలియజేస్తుందని' సైకియా తెలిపారు. పురుషుల 2025 ఆసియా కప్ సెప్టెంబర్‌లో జరగాల్సి ఉంది. ఆసియా కప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉండగా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మెన్‌గా కొనసాగుతున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మెన్ మోషిన్ నక్వీ ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68